# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్.టీ.ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 2 సంచిక : 25 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల బుధవారం 30 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE : 25 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA WED 30 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో గ్రామీణ ప్రగతి పరుగులు పెడుతోంది

- 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం ప్రారంభం
- రూ.1.30 లక్షల కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడతామన్న పవన్
- గత ప్రభుత్వంతో పోలిస్తే పది రెట్ల వేగంతో అభివృద్ధి చేస్తున్నామని వెల్లడి
- రూ.11,085 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు, మినీ గోకులాలు, పండ్ల తోటల నిర్మాణం
- అభివృద్ధి పనుల నాణ్యతను ప్రజలే పర్యవేక్షించాలని పిలుపు

- మిగతా 2లో



## వైసీపీ నేత కాకుమాను కుటుంబానికి జగన్ పరామర్శ

- ఇటీవల కన్నుమూసిన వైసీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్
- ఒంగోలులో కాకుమాను నివాసానికి వెళ్లిన జగన్
- కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా

- మిగతా 2లో

## నైపుణ్యాలే అభివృద్ధికి చోదకశక్తి

- విజయవాడలో మిషన్ కర్మయోగి దక్షిణాది రాష్ట్రాల సదస్సు
- ఉద్యోగుల సామర్థ్యాల పెంపులో ఏపీకి దేశంలోనే ప్రథమ స్థానం
- పాలనలో టెక్నాలజీ వాడకం పెరగాలని సీఎం చంద్రబాబు పిలుపు
- నేర్చుకున్న నైపుణ్యాలు సేవల నాణ్యతలో కనిపించాలని స్పష్టీకరణ

- మిగతా 2లో






# పల్లె పండుగ 3.0 ప్రారంభం..

# గ్రామాలకు రూ.11,085 కోట్లు

- ఉదయగిరిలో 'పల్లె పండుగ-3' కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ రోడ్ల అభివృద్ధికి రూ.1,185 కోట్లు కేటాయించినట్లు ప్రకటన
- గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనతో తమ రెండేళ్ల పాలనను పోల్చిన ముఖ్యమంత్రి
- వెలిగొండ ఫేజ్-2 పూర్తితో పాటు ఉదయగిరి ప్రాంతానికి పలు ప్రాజెక్టులు మంజూరు
- సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే ఎన్డీయే ప్రభుత్వ మంత్రమని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలోని పల్లెల్లో నవోదయానికి నాంది పలుకుతూ ఎన్డీయే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'పల్లె పండుగ-3' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం రామాపురంలో జరిగిన సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.11,085 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. డబుల్ ఇంజన్ సర్కార్ జెట్ స్పీడ్‌తో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "2024 ఎన్నికల్లో ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం. మీరు వేసిన ఒక్క ఓటు కూడా వృథా కాలేదు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టాం. నా అనుభవం, పవన్ కల్యాణ్ గారి ఉత్సాహం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం" అని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాలు విధ్వంసానికి గురయ్యాయని, రోడ్లు గుంతలమయమై, వీధి దీపాలు వెలగని దుస్థితి ఉండేదని ఆయన విమర్శించారు.

### గ్రామీణ రోడ్ల నిర్మాణంలో రికార్డు

'పల్లె పండుగ-3'లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 15,500 కిలోమీటర్ల బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని సీఎం వివరించారు. మరో రూ.2,700 కోట్లతో 6,000 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మిస్తామని, ప్రతి ఇంటి ముందూ బురద లేని రోడ్లు ఉండేలా చూస్తామని హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 880 కిలోమీటర్ల రోడ్లు వేస్తే, తమ ఎన్డీయే ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే 6,500 కిలోమీటర్ల రోడ్లు వేసి చరిత్ర సృష్టించిందని పోల్చి చెప్పారు. "అప్పుడు ఖర్చుపెట్టిన డబ్బులు దొంగల జేబుల్లోకి పోయాయి, ఇప్పుడు మేము ఖర్చుపెట్టే ప్రతి పైసా మీ ఊరిలో అభివృద్ధి రూపంలో కనిపిస్తోంది,"

- మిగతా 2లో

## ఉగ్రవాదంపై రెడ్ లైన్ గీశాం

అమెరికాకు జైశంకర్ గట్టి సంకేతం



- ఉగ్రవాదంపై భాగస్వాముల వైఖరి సంబంధాలను ప్రభావితం చేస్తుందన్న జైశంకర్
- తమ ప్రధాన ఆందోళనను అర్థం చేసుకోకపోతే ఇబ్బందులు తప్పవని స్పష్టీకరణ
- దశాబ్దాలుగా పొరుగు దేశం నుంచి ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్నామని వెల్లడి
- భారత్-అమెరికా బంధానికి వాణిజ్య విభేదాలతో పాటు ఉగ్రవాదం కూడా సవాల్ అని వ్యాఖ్య

- మిగతా 2లో



## ఇండియా కూటమికి డీఎంకే గుడ్ బై

పెన్ పవర్ డెస్క్: ప్రతిపక్ష ఇండియా కూటమికి డీఎంకే గుడ్ బై చెప్పింది. ఇకపై ఇండియా కూటమిలో తాము భాగం కాదని తెలిపింది. కాంగ్రెస్?తో విభేదాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే సెప్టెంబర్ 30న కాంగ్రెస్ అధ్యక్షతన జరగనున్న ఇండియా కూటమి సమావేశానికి హాజరు కావడం లేదని ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

- మిగతా 2లో

## ఏపీ విద్యా సంస్కరణలకు సింగపూర్ ప్రశంసలు.. లోకేశ్‌కు షణ్ముగం కితాబు



- ఏపీ విద్యాశాఖ మంత్రి లోకేశ్‌తో సింగపూర్ హోం మంత్రి షణ్ముగం భేటీ
- రాష్ట్రంలో విద్యా సంస్కరణలను ప్రశంసించిన సింగపూర్ మంత్రి
- మాదకద్రవ్యాల నియంత్రణ, విద్యారంగంలో ఏపీకి సహకారం అందిస్తామని హామీ
- ఏపీ ఐటీఐలను సింగపూర్ ఐటీఈతో అనుసంధానించాలని నిర్ణయం
- డ్రాపౌట్లను సున్నా శాతానికి తగ్గించాలని షణ్ముగం సూచన

- మిగతా 2లో

## నలుగురు సహోద్యోగులను కాల్చి చంపిన సీఐఎస్ఎఫ్ జవాన్




- జమ్మూకశ్మీర్‌లోని కతువా జిల్లాలో సీఐఎస్ఎఫ్ క్యాంపులో దారుణం
- సహోద్యోగులపై కాల్పులు జరిపిన హెడ్ కానిస్టేబుల్ అవధేశ్ సింగ్
- అసిస్టెంట్ కమాండెంట్ సహా నలుగురు సిబ్బంది అక్కడికక్కడే మృతి
- వాగ్వాదమే కాల్పులకు కారణమని ప్రాథమిక సమాచారం
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు.. సీఐఎస్ఎఫ్ ఉన్నతస్థాయి విచారణ

- మిగతా 2లో

## దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

- దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్న పొన్నం
- ప్రతి ఒక్కరి విశ్వాసాలను గౌరవించడం మన సంస్కృతి అని వ్యాఖ్య
- ఆలయాల అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి పేరును వాడుకోవడం సరికాదని, అది ఎవరికీ మేలు చేయదని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి వ్యక్తికి తమ తమ దేవతలపై విశ్వాసం ఉంటుందని, ఇతరుల నమ్మకాలను

- మిగతా 2లో

## ఎన్నికల 'మ్యాచ్ ఫిక్సింగ్'.. ప్రధాని మోదీ రాజీనామా చేయాలి

- ఎన్నికల ప్రక్రియలో 'మ్యాచ్ ఫిక్సింగ్' జరుగుతోందని కాంగ్రెస్ ఆరోపణ
- ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా రాజీనామాకు డిమాండ్
- 13.30 కోట్ల ఓట్లను తొలగించారని, వాటిని పునరుద్ధరించాలని తీర్మానం
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించాలని పట్టు
- పార్లమెంటు, కోర్టులు, వీధుల్లో పోరాడతామని కాంగ్రెస్ ప్రకటన

- మిగతా 2లో




## రష్యాలో కుప్పకూలిన సైనిక విమానం.. ఆరుగురు మృతి



పెన్ పవర్ డెస్క్:మాస్కో: రష్యాలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. శిక్షణ సమయంలో రష్యా సైనిక విమానం (Tu-95 బాంబర్) కుప్పకూలింది. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందగా మరొకరు గాయపడ్డారని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. తూర్పు అమూర్

- మిగతా 2లో



## అంతరాలు తగ్గించడమే నిజమైన అభివృద్ధి

- చివరి వ్యక్తి సంక్షేమమే అభివృద్ధికి గీటురాయి అన్న భగవత్
- అభివృద్ధిలో అంతరాలు వీలైనంత తగ్గించాలని సూచన
- ప్రకృతిని కాపాడుకుంటూనే ప్రగతి సాధించాలి
- అభివృద్ధి బాధ్యత సమాజం కూడా తీసుకోవాలని పిలుపు

- మిగతా 2లో

# పల్లె పండుగ 3.0 ప్రారంభం.. గ్రామాలకు రూ.11,085 కోట్లు

- మొదటి పేజీ తరువాయి

అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

**పవన్ నాయకత్వంలో పంచాయతీరాజ్ అద్భుతం**

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పంచాయతీరాజ్ శాఖ అద్భుతమైన మార్పులు తీసుకొచ్చిందని సీఎం ప్రశంసించారు. రెండున్నర దశాబ్దాల తర్వాత 10,000 మందికి పదోన్నతులు కల్పించడం, నిలిచిపోయిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4,136 కోట్లు విడుదల చేయించడం వంటి విజయాలను ఆయన గుర్తుచేశారు. పంచాయతీరాజ్ శాఖకు 13 జాతీయ అవార్డులు రావడం పవన్ పనితీరుకు నిదర్శనమని కొనియాడారు.

**ఉదయగిరికి వరాల జల్లు**

ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి పలు కీలక ప్రాజెక్టులను ముఖ్యమంత్రి మంజూరు చేశారు.

65,000 ఎకరాలకు సాగునీరు అందించే పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ కాలువ పనులకు రూ.52.52 కోట్లు.

90,000 ఎకరాలకు సాగునీరు, 2.35 లక్షల మందికి తాగునీరు అందించే సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్-1 భూసేకరణకు రూ.85 కోట్లు.

రూ.3,876 కోట్ల పెట్టుబడితో 5,100 మందికి ఉద్యోగాలిచ్చే డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా ఉదయగిరిని తీర్చిదిద్దేందుకు అవసరమైన క్లియరెన్సులు.

కనిగిరిలోని 189 ఫ్లోరైడ్ గ్రామాల సమస్య పరిష్కారానికి రూ.100 కోట్లు.

వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-2ను పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు.

**సంక్షేమం, అభివృద్ధి మా మంత్రం**

ఎన్నికల్లో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను నిలబెట్టుకున్నామని చంద్రబాబు తెలిపారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, రూ.4,000 పెన్షన్ వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తున్నామన్నారు. రూ.10 లక్షల కోట్ల అప్పులతో వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వ సహకారంతో బయటకు తీసుకొచ్చామని పేర్కొన్నారు. రాష్ట్రానికి రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని, దీని ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. అభివృద్ధికి ఎవరైనా అడ్డువస్తే ఉపేక్షించేది లేదని, సుస్థిర ప్రభుత్వంతోనే నిరంతర అభివృద్ధి సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఎడిటర్ వ్యూ

# నైపుణ్యాలే అభివృద్ధికి చోదకశక్తి

దేశాభివృద్ధిలో రాబోయే రెండు దశాబ్దాలు అత్యంత కీలకమని, ప్రజల మారుతున్న ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ పాలనా వ్యవస్థల్లో విప్లవాత్మక మార్పులు రావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. నైపుణ్యాభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారానే ఇది సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. విజయవాడలో మంగళవారం నిర్వహించిన "మిషన్ కర్మయోగి" దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సును ముఖ్యమంత్రి ప్రారంభించి ప్రసంగించారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాల పెంపులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు ప్రకటించిన పురస్కారాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్, ఏపీఎస్‌డీపీఎస్ ఈడీ వీఆర్ అలపర్తి స్వీకరించారు. ఈ విభాగంలో కర్ణాటక, ఒడిశా రాష్ట్రాలు వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచి అవార్డులను అందుకున్నాయి. శిక్షణ అంటే కేవలం ధ్రువపత్రాలు పొందడం మాత్రమే కాదని, నేర్చుకున్న నైపుణ్యాలు ప్రజలకు అందే సేవల నాణ్యతలో ప్రతిబింబించాలని సీఎం పేర్కొన్నారు. "ఒక రెవెన్యూ అధికారి సమస్యను వేగంగా పరిష్కరించడం, ఉపాధ్యాయుడు మెరుగ్గా బోధించడం వంటి సానుకూల మార్పులే శిక్షణకు అసలైన గీటురాయి" అని ఆయన వివరించారు. సాంకేతికత అందుబాటులోకి వచ్చినప్పటికీ, ఇంకా పాత నిబంధనలు, అనవసరమైన పేపర్‌వర్క్‌ను కొనసాగించడం సరికాదని, పాలనా ప్రక్రియలను సమూలంగా సంస్కరించాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

పాలనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి అత్యాధునిక సాంకేతికతలను విస్తృతంగా వినియోగించుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులు సోషల్ మీడియాలో సమయాన్ని వెచ్చించే బదులు, 'ఐగాట్-మిషన్ కర్మయోగి' వేదిక ద్వారా తమ వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రభుత్వం కేవలం నియంత్రణ వ్యవస్థగా కాకుండా, ప్రజలను సాధికారత దిశగా నడిపించేదిగా ఉండాలని, తద్వారా 2047 నాటికి వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సదస్సులో పలు దక్షిణాది రాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇండియా కూటమికి డీఎంకే గుడ్ బై

- మొదటి పేజీ తరువాయి

డీఎంకే ప్రతినిధి టి.కె.ఎస్. ఇలంగోవన్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష ఇండియా కూటమిలో ఇకపై డీఎంకే భాగం కాదని తెలిపారు. కాంగ్రెస్ తో విభేదాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. సెప్టెంబర్ 30న జరగనున్న ఇండియా కూటమి సమావేశానికి కూడా డీఎంకే హాజరు కాదని ఆయన తేల్చిచెప్పారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ తమతో బంధాన్ని తెంచుకుని అధికార టీవీకే పార్టీకి మద్దతు ఇచ్చి మాకు ద్రోహం చేసిందని విమర్శించారు. కేవలం రెండు పదవుల కోసం ఆశపడి కాంగ్రెస్ డీఎంకేకు వెన్నుపోటు పొడిచిందని అన్నారు. కాంగ్రెస్ తీరుతో ఇండియా కూటమిలోని ఇతర పార్టీలు కూడా అసంతృప్తితో ఉన్నాయని.. సమావేశానికి వెళ్లేందుకు ఆ పార్టీలు కూడా విముఖత వ్యక్తం చేస్తున్నాయని చెప్పారు. అయితే, బీజేపీపై వ్యతిరేకత విషయంలో ఇండియా కూటమిలోని పార్టీలు భావజాలపరంగా ఐక్యంగానే ఉన్నాయని చెప్పారు. ఇండియా కూటమి సమావేశానికి హాజరుకానంత మాత్రాన ఎన్డీఏకు మద్దతు ఇస్తున్నట్లు కాదని పేర్కొన్నారు.

**ఇండియా కూటమి కీలక సమావేశం**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) విషయంలో ఈసీలో భేదాభిప్రాయాలు ఉన్నాయన్న వార్తలు దేశ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలనే డిమాండ్‌తో పాటు ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియపై చర్చించేందుకు సెప్టెంబర్ 30న ఇండియా కూటమి సమావేశానికి కాంగ్రెస్ పిలుపునిచ్చింది. కాంగ్రెస్‌తో విభేదాల నేపథ్యంలో డీఎంకే ఇండియా కూటమి నుంచి వైదొలగడంతో పాటు సమావేశానికి కూడా హాజరు కావడం లేదని తెలిపింది. ఇక, ముందస్తు షెడ్యూల్ కారణంగా యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ కూడా ఇండియా కూటమి సమావేశానికి హాజరు కావడం లేదు. సమాజ్ వాదీ పార్టీ తరుఫున సీనియర్ నేత ఈ సమావేశానికి హాజరు కానున్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

- మొదటి పేజీ తరువాయి

గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమని ఆయన పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని దేవాలయాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. వేములవాడ రాజన్న, భద్రాద్రి రాముడు, కొండగట్టు ఆంజనేయ స్వామి సహా అన్ని ఆలయాల పట్ల తనకు గౌరవం, విశ్వాసం ఉన్నాయని చెప్పారు. వ్యక్తిగతంగా తనకు శివుడు ఆరాధ్య దైవమని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాలను ప్రభుత్వం గౌరవిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు.

## రష్యాలో కుప్పకూలిన సైనిక విమానం.. ఆరుగురు మృతి

- మొదటి పేజీ తరువాయి

ప్రాంతంలోని క్రాస్నోయరోవో గ్రామానికి సమీపంలో మంగళవారం (సెప్టెంబర్ 29) ఈ ప్రమాదం జరిగింది. సాంకేతిక కారణాలతో టేకాఫ్ అయిన కాసేపటికే విమానం కుప్పకూలింది. ప్రమాద సమయంలో విమానంలో మొత్తం ఏడుగురు ఉన్నారు. ఇందులో ఆరుగురు మరణించగా.. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. జనవాసాలు లేని ప్రదేశంలో విమానం కుప్పకూలడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న అధికారులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి కారణం ఏంటన్నది ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు చేప్టటారు. ఫ్లైట్ క్రాష్?కు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్?గా మారాయి. ఈ వీడియోలో.. కుప్పకూలగానే విమానం ఇంధనం ట్యాంకులు పేలిపోవడంతో భారీగా మంటలు చెలరేగడం కనిపించింది.

## ఏపీ విద్యా సంస్కరణలకు సింగపూర్ ప్రశంసలు.. లోకేశ్‌కు షణ్ముగం కితాబు

ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వినూత్న సంస్కరణలను సింగపూర్ ప్రభుత్వం ప్రశంసించింది. రాష్ట్ర విద్యావ్యవస్థ బలోపేతానికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని సింగపూర్ హోం, న్యాయశాఖల మంత్రి కె. షణ్ముగం హామీ ఇచ్చారు. మంగళవారం తిరుమలలో ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో ఆయన భేటీ అయ్యారు. శ్రీవారి దర్శనం అనంతరం ఇరువురు నేతలు రాష్ట్ర అభివృద్ధి, విద్యా సంస్కరణలు, మాదకద్రవ్యాల నివారణ వంటి కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను, ముఖ్యంగా విద్యారంగంలో తీసుకువస్తున్న విప్లవాత్మక మార్పులను మంత్రి లోకేశ్ వివరించారు. ప్రభుత్వ పనితీరుతో పాటు విద్యకు ఇస్తున్న ప్రాధాన్యతను మంత్రి షణ్ముగం ఈ సందర్భంగా అభినందించారు. పాఠశాలల్లో డ్రాపౌట్ రేటును సున్నా శాతానికి తగ్గించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి షణ్ముగం సూచించారు. బడి మానేసే పిల్లలే భవిష్యత్తులో మాదకద్రవ్యాల బారిన పడే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు సింగపూర్ తరహా కఠిన చట్టాలు అవసరమని అభిప్రాయపడుతూ, డ్రగ్స్ రహిత ఏపీ నిర్మాణానికి తమ సహకారం అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్న తీరును మంత్రి లోకేశ్ వివరించగా, ఏపీలోని ప్రభుత్వ పాఠశాలలను స్వయంగా సందర్శించేందుకు మంత్రి షణ్ముగం ఆసక్తి వ్యక్తం చేశారు. అలాగే, యువతకు ఉపాధి ఆధారిత నైపుణ్య శిక్షణ అందించే లక్ష్యంతో ఏపీలోని ఐటీఐలను సింగపూర్‌కు చెందిన 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్' (ఐటీఈ)తో అనుసంధానించేందుకు పరస్పరం సహకరించుకోవాలని ఇరువురు నేతలు నిర్ణయించారు.

## చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో గ్రామీణ ప్రగతి పరుగులు పెడుతోంది

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చే లక్ష్యంతో చేపట్టిన 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో మంగళవారం లాంఛనంగా ప్రారంభమైంది. రామాపురంలో జరిగిన ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. రాబోయే సంవత్సరాల్లో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల ద్వారా రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా రూ.1.30 లక్షల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని ప్రకటించారు.

**గత ప్రభుత్వంతో పోలిస్తే పది రెట్ల అభివృద్ధి**

ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వ పాలనతో ప్రస్తుత కూటమి ప్రభుత్వ పనితీరును పవన్ కల్యాణ్ పోల్చిచూపారు. "వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 880 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మిస్తే, మేము కేవలం రెండేళ్లలోనే దానికి పది రెట్లు ఎక్కువగా దాదాపు 9,000 కిలోమీటర్లకు పైగా పూర్తి చేశాం. వారు 304 మినీ గోకులాలు నిర్మిస్తే, మేము 30,000కు పైగా నిర్మించాం. 304 ఎక్కడ, 30,000 ఎక్కడో ప్రజలు ఆలోచించాలి" అని అన్నారు. సీఎం చంద్రబాబు దార్శనికత, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ ప్రగతిని పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు.

**రూ.11,085 కోట్లతో 'పల్లె పండుగ 3.0'**

'పల్లె పండుగ 3.0' కార్యక్రమాన్ని రూ.11,085 కోట్ల బడ్జెట్‌తో ప్రారంభిస్తున్నట్లు పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఇందులో కేంద్రం వాటా రూ.5,400 కోట్లు కాగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.5,700 కోట్లు భరిస్తోందని వివరించారు. ఈ నిధులతో 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, 22,500 మినీ గోకులాలు, 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలు, వెయ్యి కిలోమీటర్ల డ్రైన్లు, గ్రామ పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు, రచ్చబండలు వంటి అనేక పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత, వలసల సమస్య కారణంగానే ఉదయగిరిని ఈ కార్యక్రమానికి వేదికగా ఎంచుకున్నామని స్పష్టం చేశారు.

**ఉదయగిరి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు**

ఉదయగిరి నియోజకవర్గానికి మహర్దశ పట్టబోతోందని పవన్ కల్యాణ్ అన్నారు. ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి గతంలో నిలిచిపోయిన సుజలా స్రవంతి పథకాన్ని రూ.52 కోట్లతో పునరుద్ధరించి 381 పనులు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. ఉదయగిరి కోటకు వెళ్లేందుకు రూ.2.5 కోట్లతో రహదారి మంజూరు చేస్తున్నామని, అటవీ అనుమతులు త్వరగా పొందేలా అధికారులను ఆదేశిస్తున్నామని తెలిపారు. ఉదయగిరి కోటను హెరిటేజ్, ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు డీపీఆర్ సిద్ధం చేసి, కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా నిధులు సమీకరిస్తామని వెల్లడించారు.

**అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ముఖ్యం**

అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని, ఇందులో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. "మీ గ్రామంలో జరుగుతున్న పనులను ప్రజలు తమవిగా భావించి పర్యవేక్షించాలి. కాంట్రాక్టర్లు నాణ్యతగా పనిచేస్తున్నారా లేదా అని గమనించాలి. లోపాలు కనిపిస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. అవసరమైతే సోషల్ ఆడిట్ నిర్వహిస్తాం. వెచ్చించే ప్రతి రూపాయి సద్వినియోగం కావాలి" అని కోరారు.

రైతుల కోసం డొంక రోడ్ల నిర్మాణానికి పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభిస్తున్నామని, గిరిజన ఆవాసాలకు రహదారి సౌకర్యం కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తున్నామని పవన్ కల్యాణ్ వివరించారు. ఈ కార్యక్రమానికి అపూర్వ స్వాగతం పలికిన ప్రజలకు, విజయవంతం చేసిన అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## నలుగురు సహోద్యోగులను కాల్చి చంపిన సీఐఎస్ఎఫ్ జవాన్

జమ్మూకశ్మీర్‌లో తీవ్ర విషాదకరమైన సంఘటన చోటుచేసుకుంది. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్)కు చెందిన ఒక జవాన్ తన సహోద్యోగులపై విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో నలుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఒక ఉన్నతాధికారి కూడా ఉన్నారు. కతువా జిల్లాలోని సేవా-2 జలవిద్యుత్ ప్రాజెక్టు వద్ద ఈ దారుణం జరిగింది. వివరాల్లోకి వెళితే.. కతువా జిల్లాలోని బసోహ్లి ప్రాంతంలో ఉన్న సేవా-2 హైడల్ పవర్ ప్రాజెక్టుకు సీఐఎస్ఎఫ్ సిబ్బంది భద్రత కల్పిస్తున్నారు. మంగళవారం సాయంత్రం 7 గంటల సమయంలో డ్యూటీ మార్పు జరుగుతుండగా, హెడ్ కానిస్టేబుల్ అవధేశ్ సింగ్ అనే జవాన్‌కు, ఇతర సిబ్బందికి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ వాగ్వాదం తీవ్రస్థాయికి చేరడంతో ఆగ్రహంతో ఊగిపోయిన అవధేశ్ సింగ్, తన వద్ద ఉన్న తుపాకీతో సహోద్యోగులపై కాల్పులకు తెగబడ్డాడు. ఈ కాల్పుల్లో అసిస్టెంట్ కమాండెంట్ అంకిత్ కుమార్ పాండే, సబ్-ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ సింగ్, కానిస్టేబుళ్లు రఫిక్ అహ్మద్, సందీప్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. సంఘటన జరిగిన వెంటనే అప్రమత్తమైన ఇతర సిబ్బంది, నిందితుడు అవధేశ్ సింగ్‌ను అదుపులోకి తీసుకుని, కతువా పోలీసులకు అప్పగించారు. కతువా ఎస్ఎస్‌పి మోహితా శర్మ ఈ ఘటనను ధృవీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు, సీఐఎస్ఎఫ్ ప్రధాన కార్యాలయం ఈ ఘటనపై తీవ్రంగా స్పందించింది. వాస్తవాలను నిగ్గుతేల్చేందుకు ఉన్నతస్థాయి విచారణకు (కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీ) ఆదేశించింది. సీఐఎస్ఎఫ్ డీజీ స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. కేవలం చిన్న వాగ్వాదమే ఈ దారుణానికి కారణమా లేక మరేదైనా నేపథ్యం ఉందా అనే కోణంలో అధికారులు విచారణ జరుపుతున్నారు. ఒకే దళానికి చెందిన సిబ్బంది మధ్య జరిగిన ఈ కాల్పుల ఘటన (ఫ్రాట్రిసైడ్) తీవ్ర కలకలం రేపింది.

## వైసీపీ నేత కాకుమాను కుటుంబానికి జగన్ పరామర్శ

వైసీపీ అధినేత జగన్ ఈరోజు ఒంగోలులో పర్యటించారు. ఇటీవల మరణించిన పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఒంగోలులోని రాజశేఖర్ నివాసానికి వెళ్లిన జగన్, ఆయన కుటుంబ సభ్యులను కలిసి సానుభూతిని తెలియజేశారు. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు.

కాగా, విజయవాడలో సెప్టెంబర్ 21న డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ చేపట్టిన నిరసనలో జరిగిన తోపులాట అనంతరం రాజశేఖర్ అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మరణించిన విషయం తెలిసిందే. రాజశేఖర్ గతంలో లిడ్?క్యాప్ ఛైర్మన్‌గా కూడా పనిచేశారు.

## అంతరాలు తగ్గించడమే నిజమైన అభివృద్ధి

అభివృద్ధి ఫలాలు సమాజంలోని అట్టడుగున ఉన్న చివరి వ్యక్తికి అందాలని, వారి ముఖంలో చిరునవ్వు కనిపించినప్పుడే దేశం సుభిక్షంగా ఉంటుందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. మహారాష్ట్రలోని యవత్మాల్‌లో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అభివృద్ధి అంటే అందరినీ ఒకే స్థాయికి తీసుకురావడం కాదని, సమాజంలోని హెచ్చుతగ్గులను, వివిధ వర్గాల మధ్య ఉన్న అంతరాన్ని వీలైనంతగా తగ్గించడమేనని ఆయన స్పష్టం చేశారు. 'కొంతమందికే గరిష్ఠ ప్రయోజనం' చేకూరాలన్న వాదనను తాను వ్యతిరేకిస్తున్నానని, దీనదయాళ్ ఉపాధ్యాయ ఆశించినట్లుగా 'అందరికీ మేలు' జరగాలని భగవత్ ఆకాంక్షించారు. ఏ నిర్ణయం తీసుకున్నా సమాజంలోని అత్యంత నిరుపేద వ్యక్తి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్న మహాత్మా గాంధీ సూత్రాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ప్రతి వ్యక్తికి కూడు, గుడ్డ, నీడ వంటి ప్రాథమిక అవసరాలతో పాటు నాణ్యమైన విద్య, వైద్యం అందించి, వారు గౌరవప్రదంగా జీవించేలా చూడటమే నిజమైన అభివృద్ధి అని ఆయన వివరించారు. రైతులు రుణాల ఊబిలో కూరుకుపోకుండా సేంద్రియ, మిశ్రమ వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని, విత్తనాలు, ఎరువుల విషయంలో స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. ప్రగతి పేరిట ప్రకృతిని విధ్వంసం చేయకూడదని హితవు పలికారు. అభివృద్ధి బాధ్యత కేవలం ప్రభుత్వానిదే కాదని, సమాజం కూడా తన వంతు పాత్ర పోషించాలని మోహన్ భగవత్ పిలుపునిచ్చారు.

## ఎన్నికల 'మ్యాచ్ ఫిక్సింగ్'.. ప్రధాని మోదీ రాజీనామా చేయాలి

ఎన్నికల ప్రక్రియలో భారీగా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ, కేంద్ర ప్రభుత్వంపై, ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) డిమాండ్ చేసింది. మంగళవారం ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానాన్ని ఆమోదించారు.

దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియను ప్రధాని, ఎన్నికల సంఘం మధ్య జరుగుతున్న 'మ్యాచ్ ఫిక్సింగ్'గా కాంగ్రెస్ అభివర్ణించింది. ప్రధాని, హోంమంత్రి తరఫున ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ 'ఓట్ల దొంగతనానికి' పాల్పడుతున్నారని తీవ్ర ఆరోపణలు గుప్పించింది. సీఈసీని తక్షణమే పదవి నుంచి తొలగించాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను నిలిపివేయాలని తీర్మానంలో పేర్కొంది. జాబితా నుంచి అన్యాయంగా తొలగించిన 13.30 కోట్ల ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో దాదాపు 25 నిమిషాల పాటు ప్రసంగించిన రాహుల్ గాంధీ, కాంగ్రెస్ కేవలం ప్రతిపక్షం మాత్రమే కాదని, అది ఒక 'ప్రతిఘటన' పార్టీ అని స్పష్టం చేశారు. ఓటు హక్కు పునరుద్ధరణ కోసం తాము చేసే పోరాటం స్వాతంత్ర్య సంగ్రామంతో సమానమని తీర్మానంలో ఉద్ఘాటించారు. ఎన్నికల సంఘం తన స్వతంత్ర ప్రతిపత్తిని తిరిగి పొందే వరకు పార్లమెంటు, న్యాయస్థానాలు, వీధుల్లో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ఉగ్రవాదంపై రెడ్ లైన్ గీశాం

భారత్-అమెరికా సంబంధాల నేపథ్యంలో కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదంపై భారత్ ఆందోళనలను భాగస్వామ్య దేశాలు గుర్తించకపోతే, అది ద్వైపాక్షిక సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన స్పష్టం చేశారు. ఉగ్రవాదం విషయంలో భారత్ ఒక 'రెడ్ లైన్' గీసుకుందని, ఈ విషయంలో ఎటువంటి రాజీ ఉండబోదని ఆయన పరోక్షంగా హెచ్చరించారు. ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ ఉన్నత స్థాయి సమావేశాల అనంతరం న్యూయార్క్‌లో 'ఏషియా సొసైటీ' నిర్వహించిన కార్యక్రమంలో జైశంకర్ ప్రసంగించారు. దశాబ్దాలుగా ఒక పొరుగు దేశం ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా మార్చుకుని భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటోందని, పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించకుండానే ఆయన దుయ్యబట్టారు. "అత్యంత కీలకమైన ఉగ్రవాద సమస్యపై మా భాగస్వామ్య దేశాల నుంచి సరైన అవగాహన, సానుభూతి లభించకపోతే, అది కచ్చితంగా ఇబ్బందులకు దారితీస్తుంది. మా ప్రాథమిక ఆందోళనలను విస్మరిస్తే, సంబంధాలపై ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. భారత్-అమెరికా సంబంధాలను ప్రభావితం చేసే అంశాల్లో వాణిజ్య, టారిఫ్ వివాదాలతో పాటు ఉగ్రవాదం కూడా ప్రధానమైనదని జైశంకర్ వివరించారు. ప్రస్తుత అమెరికా ప్రభుత్వం పాకిస్థాన్ పట్ల సానుకూల ధోరణితో వ్యవహరిస్తున్న తరుణంలో జైశంకర్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

భారత్-అమెరికా బంధం భవిష్యత్తులో మరింత బలోపేతం అవుతుందని ఆశిస్తున్నప్పటికీ, పరిష్కరించాల్సిన సమస్యల విషయంలో వాస్తవిక దృక్పథంతో ఉండాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పొరుగు దేశం నుంచే మద్దతు అందుతోందని నిరూపించేందుకు భారత్ పదేపదే తగిన ఆధారాలను సమర్పించిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఏన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన వేటపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థినీలు

### జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటిన వేటపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థినీలు



**వేటపాలెం, సెప్టెంబర్ 29, (పెన్ పవర్) :**
బాపట్లలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వేటపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థినీలు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు దేవరకొండ సరోజినీ తెలియజేశారు.
అండర్ -16 60 మీటర్ల పరుగు పందెంలో ఎల్. వైష్ణవి, కె. గాయత్రి ప్రథమ, ద్వితీయ స్థానాలు, లాంగ్ జంప్ లో ఎల్. వైష్ణవి, కె. గాయత్రి ప్రథమ, తృతీయ స్థానాలు, షాట్ పుట్ లో కె. గాయత్రి ప్రథమ స్థానం సాధించారు. వీరు అక్టోబర్ 1, 2 తేదీల్లో కర్నూల్ లో జరగబోవు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బాపట్ల జిల్లా తరఫున పాల్గొంటారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు జె. దేవ బిక్షం, జె. శ్రావణి, పాఠశాల స్టాప్, విద్యార్థులు అభినందనలు తెలియజేసి రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా రాణించాలని బెస్ట్ విషెస్ తెలియజేశారు.

## ఖాళీ షాపులకు వారం రోజుల్లో వేలం

### రెవెన్యూ సేవల్లో జాప్యంపై కమిషనర్ ఆగ్రహం

**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 29:**
గుంటూరు నగర పాలక సంస్థకు చెందిన ఖాళీగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ షాపులకు వారం రోజుల్లోగా వేలం నిర్వహించి, కేటాయింపులు పూర్తి చేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్రెవెన్యూఅధికారులనుఆదేశించారు.మంగళ వారంనగరపాలకసంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐల వారీగా రెవెన్యూ, వీఎల్టీ వసూళ్లను సమీక్షించి, తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు.ప్రజల నుంచి వచ్చే మ్యుటేషన్, నూతన పన్ను, వీఎల్టీ తదితర సర్వీస్ రిక్వెస్టులను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సేవల్లో జాప్యం చేస్తే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.సర్వీస్ రిక్వెస్టులు పెండింగ్లో ఉండటం, ఎస్ఎల్ఏ గడువు దాటినా పరిష్కరించకపోవడం, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై వార్డు సచివాలయం-3 బిల్ కలెక్టర్ పద్మావతి, వార్డు సచివాలయం-17



రెవెన్యూ కార్యదర్శి సుందర్సింగ్లను సస్పెండ్ చేసి, చార్జెస్ ఫ్రేమ్ చేసి విచారణ చేపట్టాలని డిప్యూటీ కమిషనర్లను ఆదేశించారు.అలాగే నగర పాలక సంస్థ షాపుల బకాయిలను వంద శాతం వసూలు చేయాలని, లీజు గడువు ముగిసిన షాపులకువారం రోజుల్లోగా వేలం నిర్వహించాలని సూచించారు. వేలం ప్రక్రియలో జాప్యం జరిగితే సంబంధిత ఆర్ఓలు, ఆర్ఐలే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.రెవెన్యూ విభాగానికి వచ్చే ప్రజా ఫిర్యాదులను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని, ఎలాంటి కారణం



లేకుండా సేవలు లేదా ఫిర్యాదులను తిరస్కరిస్తే సంబంధిత రెవెన్యూ ఇన్స్పెక్టర్లపై చర్యలు తీసుకుంటామనికమిషనర్హెచ్చరించారు.నగరం లోని కొత్తగా పన్ను విధించాల్సిన అపార్ట్మెంట్లు, లేఅవుట్లకునిబంధనలప్రకారం పన్ను విధించాలని, పన్నుల నిర్ధారణలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.సమావేశంలో అదనపు కమిషనర్ ఐ.కిషోర్, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సి.హెచ్.శ్రీనివాస్,జి.సాంబశివరావు,సూపరింటెం డెంట్ రవికిరణ్రెడ్డి, రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## యువత భవిష్యత్తుకు బంగారు బాట వేస్తున్న కూటమి ప్రభుత్వం

### ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు





**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 29:**
యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు నియామక ప్రక్రియలో పారదర్శకతకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు అన్నారు.
వట్టిచెరుకూరు మండలం విజనంపాడు గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కాలేజీ, పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన 'యువత భవితకు భరోసా' కార్యక్రమాల్లో రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి, యువత భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు.ఉద్యోగ నియామకాల్లో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రతి విద్యార్థికి తన ప్రతిభ, మెరిట్ ఆధారంగా అవకాశం దక్కేలా వ్యవస్థ ఉండాలన్నారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.విద్యార్థులు తమ ముందున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. యువతకు మంచి విద్య, మంచి ఉద్యోగం, మంచి భవిష్యత్తు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.
ఈ కార్యక్రమంలో జనసేన ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు, రాష్ట్ర రైతు మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, కిట్స్ కాలేజీ చైర్మన్ కోయ సుబ్బారావు, మలినేని కాలేజీ చైర్మన్ మలినేని పెరుమాళ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 10 వేల మందితో భారీ పరుగుకు సన్నాహాలు ఆంధ్ర కార్పొరేషన్

### చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్

**విజయవాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 29:**
మహాత్మా గాంధీ జయంతి, స్వచ్ఛ దివస్ సందర్భంగా అక్టోబర్ 2న విజయవాడ--అమరావతి ప్రాంతంలో 'స్వచ్ఛతాన్' మారథాన్ నిర్వహించనున్నట్లు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు.
విజయవాడలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మారథాన్కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పరిశుభ్రత, పారిశుధ్యం, ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే 'స్వచ్ఛతాన్' ప్రధాన ఉద్దేశమని తెలిపారు.గత ఏడాది నిర్వహించిన తొలి ఎడిషన్కు 6 నుంచి 7 వేల మంది రన్నర్లు పాల్గొనగా, ఈ ఏడాది సుమారు 10 వేల మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. 5కె, 10కె, 21కె హాఫ్ మారథాన్ విభాగాల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు మొత్తం రూ.10 లక్షల నగదు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.
అక్టోబర్ 2న ఉదయం 5 గంటలకు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి మారథాన్ ప్రారంభం కానుంది. మంత్రి నారా లోకేష్ ఫ్లాగ్ ఆఫ్ చేయనుండగా, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, సినీ, క్రీడా ప్రముఖులు పాల్గొననున్నారు.
విజయవాడ నుంచి కృష్ణా బ్యారేజ్ మీదుగా అమరావతి రాజధాని ప్రాంతంలోని మంతెన సత్యనారాయణ రాజు




ఆశ్రమం వరకు మారథాన్ కొనసాగనుంది. రన్నర్ల కోసం పోలీసు, మున్సిపల్, జిల్లా యంత్రాంగం సమన్వయంతో రూట్ క్లియరెన్స్, భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.
మార్గమధ్యంలో డ్రమ్మర్లు, కళాబృందాల ప్రదర్శనలు, జుంబా తదితర కార్యక్రమాలతో రన్నర్లను ఉత్సాహపరచనున్నారు. అమరావతి రన్నర్స్ ఆర్గనైజింగ్ పార్ట్నర్గా, హెచ్డీఎఫ్సీ బ్యాంక్ టైటిల్ స్పాన్సర్గా, మెడ్స్టార్ హాస్పిటల్స్ మెడికల్ పార్ట్నర్గా వ్యవహరిస్తున్నాయి.
గాంధీ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న 'స్వచ్ఛతాన్' మారథాన్ ద్వారా పరిశుభ్రతపై ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావడంతో పాటు, స్వచ్ఛాంధ్ర ఉద్యమంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యమని కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు.

## ముఖ్య మంత్రి పర్యటన ఏర్పాట్లు చేయాలి

### కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ



**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 29 :**
గుంటూరు జిల్లా తెనాలి మండలం బుర్రిపాలెంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణ పనులకు అక్టోబర్ 4వ తేదీన శంకుస్థాపన చేయనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్ర శేఖర్ పాల్గొననున్నారని చెప్పారు. హెలిపాడ్ ఏర్పాట్లు, రహదారి మరమ్మతులు, వేదిక నిర్మాణం తదితర అంశాలను పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజనీర్ ఆర్.శ్రీనివాస మూర్తి, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జె.వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, తహసిల్దార్ గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లనమోదు కమిషనర్

### కె.మయూర్ అశోక్



**గుంటూరు: పెన్ పవర్, సెప్టెంబర్, 29,**
కృష్ణా--గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి ఓటర్ల జాబితాను కొత్తగా రూపొందిస్తున్నట్లు నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. 01.11.2026ను అర్హత తేదీగా నిర్ణయించామని, అర్హులైన ఉపాధ్యాయులు ఫారం-19తో నవంబర్ 6లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో ఓటు ఉన్నవారు కూడా కొత్తగా నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. నవంబర్ 25న ముసాయిదా జాబితా, డిసెంబర్ 30న తుది జాబితా విడుదల చేస్తామని వెల్లడించారు.
స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లను కూడా సమీక్షించిన కమిషనర్.. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, సిబ్బంది నియామకం, ఎన్నికల సామగ్రి తదితర ఏర్పాట్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

## పనుల్లో జాప్యం చేస్తే కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టండి ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 29,**
నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతంలో, ప్రతి గడపలో సమస్యలను తెలుసుకునేందుకు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ క్షేత్రస్థాయిలో సుడిగాలి పర్యటన చేస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం మద్దిరాలకాలనీ, మంగళదాస్ నగర్, రాజగోపాల్ నగర్, బసవతారకనగర్, గడ్డిపాడు ప్రాంతాలను పరిశీలించారు. ఆయా ప్రాంతాలలో ప్రజలతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మద్దిరాల కాలనీలో రోడ్ల నిర్మాణంలో అలసత్వంపై అధికారులను ప్రశ్నించారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిర్దిష్ట సమయంలోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనుల్లో జాప్యం జరిగితే మాత్రం సంబంధిత కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశించారు. వర్షాకాలం కావడంతో డ్రెయిన్ల నిర్మాణంలో వేగవంతంగా పనులు చేపట్టాలన్నారు. దీనిపై సమగ్ర ప్రణాళిక



రూపొందించాలని మున్సిపల్ అధికారులకు చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలోని అభివృద్ధి పనులు చేపట్టేందుకు అంచనాలు రూపొందించి నిధులు రాబట్టగలుగుతున్నామని తెలిపారు. వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి రోడ్లు, డ్రెయిన్లు,



ఇతర అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వంలో నియోజకవర్గాన్ని పదేళ్లు అభివృద్ధిలో వెనక్కి తీసుకెళ్లారని, కనీసం ప్రధాన రోడ్లలోనూ తట్టమట్టి వేసిన దాఖలాలు లేవని విమర్శించారు.

## మల్లవరంలో పల్లె పండుగ 3.0 పనులకు

### శ్రీకారం ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు

**గుంటూరు: పెన్ పవర్, సెప్టెంబర్, 29,**



గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను బలోపేతం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు తెలిపారు. గుంటూరు రూరల్ మండలం మల్లవరం గ్రామంలో పల్లె పండుగ 3.0--ఎదీ-+=ూవీ+ పథకం కింద రూ.1.52 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న 13 అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత



ఇస్తోందన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో పల్లె పండుగ 3.0--VB-GRAMG కింద మొత్తం రూ.7.29 కోట్ల విలువైన పనులు చేపడుతున్నట్లు తెలిపారు.
గత పాలనలో గ్రామీణ ప్రాంతాల మౌలిక వసతుల అభివృద్ధిపై తగిన శ్రద్ధ చూపకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఎమ్మెల్యే విమర్శించారు.
ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటివరకు రూ.2 వేల కోట్ల నిధులు తీసుకువచ్చామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామాల్లోని సమస్యలను గుర్తించిదశలవారీగా పరిష్కరిస్తోందన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జనసేన ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర రైతు మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, గుంటూరు రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు యిమ్మడి లీలామల్లేశ్వరరావు, తెల్లమేకల రమేష్, మాజీ సర్పంచులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఏపీ మోడల్ స్కూల్ ఎస్ఎంసీ ఎన్నికలపై వివాదం

### నిబంధనలకు విరుద్ధంగా ఎన్నిక జరిగిందని కొందరు తల్లిదండ్రుల ఆరోపణలు

**సీసీ ఫుటేజ్ పరిశీలించి సమగ్ర విచారణ చేయాలని డిమాండ్**
**చీరాల, సెప్టెంబర్ 29, (పెన్ పవర్) :**
చీరాల ఏపీ మోడల్ స్కూల్లో మంగళవారం నిర్వహించిన స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు వివాదానికి దారితీశాయి. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు జరగలేదని కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. గతంలో పాఠశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, కుకింగ్ విభాగం, ఇతర సిబ్బందిపై పలు ఆరోపణలు, కోర్టు కేసులు ఉన్న నేపథ్యంలో ఈ ఎన్నికలపై మరింత చర్చ జరుగుతోంది.
ఎస్ఎంసీ ఎన్నికల కోసం మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు సమయం కేటాయించినప్పటికీ, పలువురు తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకునేలోపే కొందరు సిబ్బందికి అనుకూలంగా ఉన్న




వ్యక్తుల పేర్లను నమోదు చేసి ఎన్నిక పూర్తయిందని ప్రకటించారంటూ తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీంతో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగిందా లేదా అనే అంశంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి స్వయంగా పాఠశాలను పరిశీలించి సీసీ ఫుటేజ్ను పరిశీలించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఎన్నికల సమయంలో ఎంతమంది తల్లిదండ్రులు హాజరయ్యారు? ఎవరెవరు ఎన్నికల్లో పాల్గొన్నారు? కో-ఆప్షన్ సభ్యులుగా ఎంపికైన వారు నిబంధనల ప్రకారం అర్హులేనా? తదితర అంశాలపై సమగ్రంగా విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వారు పేర్కొంటున్నారు.
ఎస్ఎంసీ ఎన్నికలపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో సంబంధిత విద్యాశాఖ అధికారులు స్పందించి ఎన్నికల ప్రక్రియపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు. తాజా పరిణామాలతో చీరాల ఏపీ మోడల్ స్కూల్ మరోసారి వివాదానికి కేంద్రంగా మారింది.

## క్యూ ఆర్ కోడ్ పై అవగాహన





**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 29 :**
పౌర సరఫరాల శాఖ పంపిణీ చేస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థ (పి.డి.ఎస్) లో క్యూ ఆర్ కోడ్ కీలక పాత్ర వహిస్తుందని జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ అన్నారు. క్యూ ఆర్ కోడ్ అమలు, తదితర అంశాలను ప్రత్తిపాడు ఎం.ఎల్.ఎస్ పాయింట్ తో పాటు పలు చౌక ధరల దుకాణాలలో డి.ఎస్.ఓ మంగళవారం పరిశీలించారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో నాలుగు మండలాల డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డీలర్లకు క్యూ ఆర్ కోడ్ విధానంపై అవగాహన కలిగించారు. పి.డి.ఎస్ మరింత పారదర్శకంగా పని చేయుటకు నూతనంగా ప్రవేశపెట్టిన క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ విధానంలో డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను నివృతి చేశారు. చౌక ధరల దుకాణాలలో పంపిణీ విధానాన్ని పరిశీలించారు.
ఈ కార్యక్రమంలో సి.ఎస్ డి.టి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఎం సి చైర్మన్, వైస్ చైర్మన్ లు ఏకగ్రీవ ఎన్నిక





**పెడన, పెన్ పవర్, సెప్టెంబర్ 29**
కాకర్లమూడి, కాకర్లమూడిపాలెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల పాఠశాల నిర్వహణ కమిటీ (రావీజ) చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. రెండు పాఠశాలలకు చైర్మన్‌లుగా గుడిసే నరసింహస్వామి, లింగం రత్నకుమారి, వైస్ చైర్మన్‌లుగా పరసా గోవిందమ్మ, ముచ్చు నరసమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాల మెరుగుదలతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు విద్యార్థులకు సక్రమంగా అందేలా కమిటీ సభ్యులతో కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు సహకరించాలని కోరారు.

## రైతు కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి: కొల్లి రంగారెడ్డి

**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 29:**
రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున సంబంధిత మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించి రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తపేట ఏఐకేఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మేరకు గతంలో మండల, గ్రామ సచివాలయాల్లో వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు.
సాధారణ వర్షపాతం కంటే 55 శాతం లోటు ఏర్పడటంతో ఖరీఫ్ సాగు తీవ్రంగా దెబ్బతిందన్నారు. కంది, టమోటా, పత్తి, వేరుశనగ తదితర పంటలు ఎండిపోతున్నాయని, పంటలు సాగు కాక వ్యవసాయ కూలీలకు ఉపాధి లేక వలసలు పెరుగుతున్నాయని తెలిపారు. పశువులకు మేత, తాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.
ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెం గ్రామానికి చెందిన రైతు చిమటా భాస్కర్ అప్పుల బాధతో మంగళవారం ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని, పిల్లల చదువులను ప్రభుత్వమే ఉచితంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.




కరువు ప్రభావిత రైతులకు ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా పరిహారం అందించాలని, రైతు, కౌలు రైతుల పంట రుణాలు మాఫీ చేయాలని కోరారు. ఉపాధి హామీ పనులను పెద్దఎత్తున చేపట్టి వలసలను అరికట్టాలని, పశువులకు ఉచిత మేత, తాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.
ఈ సమావేశంలో నాయకులు జంగాల చైతన్య, కాయల రామారావు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షురాలిగా లక్ష్మీదుర్గ



**పెడన, పెన్ పవర్, సెప్టెంబర్ 29**
స్థానిక చేవెంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. ప్రధానోపాధ్యాయులు పరిశె కరుణానిధి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో కమిటీ అధ్యక్షురాలిగా తమ్మా బత్తుల లక్ష్మీదుర్గ, ఉపాధ్యక్షురాలిగా తల్లిబోయిన దయామణి సభ్యుల చేత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులను కమిటీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## హై స్కూల్ చైర్మన్ గా... షేక్ యూసుఫ్
## వైస్ చైర్మన్ గా సందిపోకు మేరీ

**బెల్లంకొండ సెప్టెంబర్ 29 పెన్ పవర్**
మండల కేంద్రమైన బెల్లంకొండ జిల్లా పరిషత్ హై స్కూల్ చైర్మన్గా షేక్ ఈ సుబ్బు వైస్ చైర్మన్గా సందిపోగు మేరి నీమంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్లో హెడ్మాస్టర్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుండి రెండు గంటల పాటు జిల్లా పరిషత్ హై స్కూల్ బాడీని ఎన్నుకున్నారు. బాడీలో అన్ని కులాల వారికి ప్రాధాన్యత ఇస్తూ చైర్మన్ ఎన్నికను విజయవంతంగా కమిటీ నెంబర్లు ఉపాధ్యాయులు అందరూ కలిసి ఎంపిక చేశారు. బెల్లంకొండ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఎన్నిక ఎలాంటి అవకతవకలు లేకుండా వివాదాలకు తావు ఇవ్వకుండా.. విద్యార్థుల తల్లిదండ్రులకు గౌరవించి వారి యొక్క ఇష్టాలు అష్టాలను తీసుకొని పాఠశాలలోని చదివే పిల్లల తల్లిదండ్రులకు యొక్క అభిప్రాయాలతోనే ఈ ఎన్నిక విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పిఎస్కే మస్తాన్ షరీఫ్ మాజీ సర్పంచి సముద్రం సయ్యద్ నవాబ్ జానీ



గ్రామ పార్టీ అధ్యక్షులు సయ్యద్దు మజీద్ నిడమానూరు పిచ్చయ్య. జబ్బార్. సయ్యద్ హసన్ సంది పోగు లింగారావు వివిధ గ్రామాల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో రక్తదాన శిబిరం

**గుంటూరు:పెన్ పవర్, సెప్టెంబర్, 29,**
ప్రధాని నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజాసేవను పురస్కరించుకునినిర్వహిస్తున్న'సేవాసంకల్ప్అభియాన్' లోభాగంగాభారతీయజనతా యువమోర్చా ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తుంగా యశ్వంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాయతి ప్రదీప్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది విద్యార్థినీ, విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ రక్తదానం అన్నిటికంటే గొప్ప సేవ అని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ సంవత్సరానికి కనీసం ఒక్కసారైనా స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందుబాటులో ఉండటం ద్వారా ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు.
యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గంగాధర్ రక్తదానం చేసిన విద్యార్థినీ, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. రక్తదానం ప్రాధాన్యత, ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.రక్తదానం చేసిన విద్యార్థినీ,



విద్యార్థులకు బీజేవైఎం ఆధ్వర్యంలో పండ్లు, పాలు, చిక్కీలు అందజేశారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి చల్లా కౌశిక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ఉపాధ్యక్షులు కొచ్చర్ల శ్రీదుర్గ, చేవూరి ఆనంద్, కార్యదర్శి ఆకాష్, కార్యవర్గ సభ్యుడు సురేంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యడ్లపాటి స్వరూపరాణి, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యదర్శి కుమార్ గౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవీ సుబ్బారావు, యూనివర్సిటీ ప్రోగ్రాం కన్వీనర్ వెంకటరమణ, యూనివర్సిటీ సిబ్బంది తదితరులు



## సమస్యలను గుర్తించి అధికారులకు వినతిపత్రం అందించిన బాలల పార్లమెంట్ సభ్యులు

**విజయవాడ, పెన్ పవర్ , సెప్టెంబర్ 29:**
తాడేపల్లి మండలం గుండిమెడ గ్రామంలో సరోజిని నాయుడు బాలల పార్లమెంట్ సమావేశం మంగళవారం నిర్వహించారు. గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ ఆధ్వర్యంలోని చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాలల పార్లమెంట్ సభ్యులు గ్రామంలోని పలు సమస్యలను గుర్తించారు.అనంతరం సమస్యల పరిష్కారం కోరుతూ గ్రామ సచివాలయ కార్యదర్శి జె. అశోక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో పిల్లల కోసం లైబ్రరీ ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ కాలువల్లో పూడిక తొలగించి బ్లీచింగ్ చల్లాలని కోరారు. వడ్డేశ్వరం నుంచి గుండిమెడకు వచ్చే కొత్త రహదారిలో వీధి



దీపాలు ఏర్పాటు చేయాలని, కె.ఎల్. యూనివర్సిటీ విద్యార్థులు బైక్‌లపై వేగంగా ప్రయాణిస్తున్నందున రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.పిల్లలకు చిన్నతనం నుంచే సమాజం పట్ల బాధ్యత, గౌరవ భావాలను పెంపొందించేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని గ్రామస్థులు తెలిపారు. బాలల్లో ధైర్యం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తున్న గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ సేవలను వారు అభినందించారు.బాలల పార్లమెంట్ సభ్యులు గుర్తించిన సమస్యలను త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సచివాలయ కార్యదర్శి జె. అశోక్ కుమార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుడ్ షెఫర్డ్ సిబ్బంది అత్తోట పోతురాజు, సరోజిని నాయుడు బాలల పార్లమెంట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పందిళ్లపల్లి పీహెచ్‌సీ పునర్నిర్మాణానికి చర్యలు
## రూ.1.93 కోట్లతో పనులు చేపట్టేందుకు అధికారుల పరిశీలన

**పునర్నిర్మాణంతో పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు**

**వేటపాలెం, సెప్టెంబర్ 29, (పెన్ పవర్) :**
వేటపాలెం మండలంలోని పందిళ్లపల్లి ప్రాథమిక వైద్యశాల పునర్నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఒంగోలు ఏపీఎంఎస్ఐడీసీకి చెందిన డీఈ వెంకటసుబ్బయ్య, ఏఈ పోతయ్య వైద్యశాల స్థలాన్ని పరిశీలించారు. సుమారు రూ.1.93 కోట్లతో ఆసుపత్రి పునర్నిర్మాణ పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.
ఈ సందర్భంగా ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ ఎస్. విజయకుమార్, నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షులు పోలకం చంద్రశేఖర్, వేటపాలెం మండలటీడీపీఅధ్యక్షులు గుత్తి సీతారామాంజనేయులు, గ్రామ పార్టీ అధ్యక్షులు పేరిసెట్ల బాలచంద్ర, పీఏసీఎస్



చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, కొలుకుల బాల సుబ్రమణ్యం, గుత్తి లింగమూర్తి, సామాజికవేత్త చెరుకూరిరాంబాబుతదితరులు పాల్గొన్నారు.పందిళ్లపల్లి ప్రాథమిక వైద్యశాల పునర్నిర్మాణానికి సహకరిస్తున్న చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్యతో పాటు కూటమి నాయకులకు గ్రామ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పునర్నిర్మాణ పనులు పూర్తయితే పందిళ్లపల్లి గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## గుండె భద్రం.. ఆరోగ్యం పదిలం
## యువతలోనూ పెరుగుతున్న గుండె జబ్బులు: డాక్టర్ దాసరి చంద్రశేఖర్

**ఆరోగ్యకరమైన ఆహారం, నిత్య వ్యాయామంతో గుండెను కాపాడుకోవాలి**

**పర్చూరు, సెప్టెంబర్ 29, (పెన్ పవర్) :**
ప్రపంచగుండెదినోత్సవాన్నిపురస్కరించుకునిమంగళవారం ఉదయం ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద గుండె ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గడం, మానసిక ఒత్తిళ్లు వంటి కారణాలతో యువతలో సైతం గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు.



గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ప్రతిరోజూ కనీసం 45 నిమిషాలు నడవాలని సూచించారు. జంక్‌ఫుడ్, డీప్‌ఫ్రైడ్ ఆహారాలు, అధిక ఉప్పు, కారం, మసాలాలనుతగ్గించితాజాఆకుకూరలు, కూరగాయలు, పండ్లను ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు. ధూమపానం, మద్యపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని, మానసిక ప్రశాంతత కోసం యోగా, ధ్యానం చేయాలని సూచించారు. అసూయ, ద్వేషం వంటి ప్రతికూల భావోద్వేగాలను విడనాడి ఇతరులతో ప్రేమపూర్వకంగా మెలగాలని పేర్కొన్నారు. 30 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ వైద్యులను సంప్రదించి కనీసం సంవత్సరానికి ఒకసారైనా గుండెకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఛాతిలో తీవ్రమైన నొప్పి, విపరీతమైన చెమటలు, ఆయాసం, ఎడమ చేయి లాగడం వంటి లక్షణాలు కనిపిస్తే గుండెపోటుకు సూచన కావచ్చని, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో వైద్యశాలకు వచ్చిన రోగులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అనాథలకు అన్నదానం
## మానవ జీవితం క్షణికం.. మంచి పనులు చేయాలి: మోహన్‌రావు

**వరలక్ష్మి నాలుగో వర్ధంతి సందర్భంగా 70 మందికి అన్నదానం**

**దేవాంగపురి, సెప్టెంబర్ 29, (పెన్ పవర్) :**
అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని బట్టమోహన్‌రావు--పుష్పవల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మోహన్‌రావు అన్నారు. మండలంలోని దేవాంగపురి పంచాయతీ పరిధిలోని శివాలయంలో మంగళవారంకంకటపాలెంవాస్తవ్యురాలుగొట్టుముక్కల వరలక్ష్మి నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని ఆమె



కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ మానవ జీవితం క్షణికమైనదని, జీవించి ఉన్నంతకాలం ఇతరులకు ఉపయోగపడే మంచి పనులు చేయాలని సూచించారు. సేవా కార్యక్రమాల ద్వారా పేదలు, అనాథలకుఅండగానిలవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సుమారు 70 మందికి అన్నదానం చేశారు.కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పుట్టం రాజు సీతారామయ్య, గుత్తి పరంజ్యోతి, రోహిణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలపై విద్యార్థులకు అవగాహన

**చీరాల, సెప్టెంబర్ 29, (పెన్ పవర్) :**
చీరాలలోని చైతన్య భారతి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాపట్ల జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అండ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ శాఖ అధికారి రాజారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వంలోని వివిధ ఉద్యోగ అవకాశాలు, నియామక ప్రక్రియ, పోటీ పరీక్షలు, అర్హతలు, పరీక్షలకు సిద్ధమయ్యే విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.
అదేవిధంగా కృత్రిమ మేధస్సుకు సంబంధించిన



అంశాలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య పోర్టల్‌లో ఇంటర్వ్యూ విధానంపై కూడా విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి తమ సందేహాలను అధికారిని అడిగి తెలుసుకున్నారు. పోటీ పరీక్షలకు ముందస్తు ప్రణాళికతో సిద్ధమై, అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సోమేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉద్యోగ అవకాశాలపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులపై బెదిరింపులు, కిడ్నాప్ ఘటనలను ఎస్టీయు ఖండిస్తుంది.
## ఎస్ఎంసీ ఎన్నికల సందర్భంగా ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలి.

**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, సెప్టెంబర్ 29 :**
పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల సందర్భంగా ఎడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని కిడ్నాప్ చేయడం, ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేయడం తీవ్రంగా ఖండించదగిన విషయం అని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కే కోటేశ్వరరావు రాష్ట్ర డైరీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు లు పేర్కొన్నారు. హై స్కూల్ నందు దౌర్జన్యానికి దిగి పాఠశాల ఆవరణలో కొట్టుకోవడం తీవ్ర అక్షేపనీయమని అన్నారు పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించడంలో ఉపాధ్యాయుల పాత్ర పరిమితమైనదని, ఎన్నికల



ప్రక్రియ సజావుగా జరిగేలా విధులు నిర్వహించడం మాత్రమే వారి బాధ్యత అనితెలిపారు . ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులను బెదిరించడం, కిడ్నాప్ చేయడం వంటి ఘటనలు విద్యా వాతావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తాయని .ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలసమయంలోవిధులునిర్వహించేఉపాధ్యాయులకు తగిన భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎస్టీయు పల్నాడు జిల్లా అధ్యక్షులు ఎల్విరామిరెడ్డి ప్రధాన కార్యదర్శి ఏమండీ ఎడ్లపాడు మండల అధ్యక్షులు జి కోటేశ్వరరావు ప్రధాన కార్యదర్శి జి సతీష్ కుమార్ ఆర్థి క కార్యదర్శి వీరవాసు డిమాండ్ చేస్తుందని తెలిపారు

# పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యమే స్వచ్ఛ నరసరావుపేటకు బలం
## స్వచ్ఛ భారత్, వికసిత భారత్ మనందరి లక్ష్యం

**స్వచ్ఛ భారత్ -- వికసిత భారత్ లక్ష్యంతో ప్రత్యేక వైద్య శిబిరం**
**ముఖ్య అతిథిగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు**

**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 29:**
స్వచ్ఛ భారత్ -- వికసిత భారత్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతా హీ సేవ -- 2026లో భాగంగా నరసరావుపేట మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన ఆధ్వర్యంలో మంగళవారం సఫాయి సురక్ష శిబిరం నిర్వహించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఈ ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని కమిషనర్ రమ్య కీర్తన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసరావు పేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు హాజరయ్యారు, వారితో పాటు బీజేపీ నాయకులు రంగిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు. వీరిద్దరి చేతులమీదుగా రిబ్బన్ కట్ చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు మాట్లాడుతూ.. ప్రతిరోజూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు నిరంతరం శ్రమించే పారిశుద్ధ్య కార్మికులు కూడా ఆరోగ్యంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అందులో భాగంగానే వారి ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేకంగా ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.
పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే పట్టణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని, వారి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం అవసరమని ఎమ్మెల్యే తెలిపారు. కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ











ఇలాంటి ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ వైద్య శిబిరంలో వేద ఆసుపత్రి, మరియు మ్యాక్సీ విజన్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు పాల్గొని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సమస్యలను గుర్తించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ఏ. క్రాంతిశ్రీ, డాక్టర్ ఎన్. క్రాంతికుమార్ రెడ్డి, వారి సిబ్బంది పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన మాట్లాడుతూ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ నిర్వహించిన ఈ శిబిరం ద్వారా వారి ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు పట్టణ పారిశుద్ధ్య నిర్వహణలో వారి పాత్రను గుర్తుచేశారు. అలాగే మెగ్మా వారి సౌజన్యంతో (జూటు, క్లాత్ బిగ్స్, వైరు బుట్టలు )స్టాల్ ఏర్పాటు చేసి పర్యావరణాన్ని కాపాడటం మనందరి బాధ్యత అని కమిషనర్ తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ పి. రమాదేవి, రామకోటయ్య, శానిటరీ, పర్యావరణ కార్యదర్శులు, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, ఇతర మున్సిపల్ సిబ్బంది పార్టీ నాయకులు క్రాంతి, పాల్గొన్నారు.

# భవిష్యత్తు కోసం ఎదురుచూడకండి.. భవిష్యత్తును మీరే నిర్మించుకోండి
## ధైర్యంగా ముందుకు సాగండి.. విజయాలు మీ ముంగిటకు వస్తాయి

**-మీకు మీరే సాటి.. తల్లిదండ్రులకు మీరే నిజమైన ఆస్తి**
**-జెన్-జీ యువతకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పిలుపు**

**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 29:**
నేటి జెన్-జీ యువత భవిష్యత్తు కోసం ఎదురుచూసే తరం కాదని, తమ ప్రతిభ, నైపుణ్యాలతో భవిష్యత్తును స్వయంగా నిర్మించుకునే తరమని నరసరావు పేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు.నరసరావుపేటలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన యువత భవితకు భరోసా -- జెన్-జీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం, కృత్రిమ మేధస్సు, ఆంగ్ల భాష, సంభాషణ నైపుణ్యాలు, డిజిటల్ నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కేవలం ఉద్యోగం కోసం ప్రయత్నించకుండా, నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని, పారిశ్రామికవేత్తలుగా, నూతన వ్యాపార సంస్థల స్థాపకులుగా రాణించేందుకు అవకాశాలను అన్వేషించాలని పిలుపునిచ్చారు. కృత్రిమ మేధస్సు వల్ల ఉద్యోగాలు పోతాయనే భయానికి గురికాకుండా, దానిని సమర్థంగా వినియోగించుకునే నైపుణ్యాన్ని పెంచుకోవాలని అన్నారు.
సామాజిక మాధ్యమాల వినియోగంలో యువత అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. అంతర్జాలంలో వైరల్ అయ్యే ప్రతి సమాచారం నిజం కాదని, ఏదైనా సమాచారాన్ని ఇతరులకు పంపే ముందు





దాని నిజానిజాలను నిర్ధారించుకోవాలని హితవు పలికారు.సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతిరోజూ కొంత సమయాన్ని చదువు, నైపుణ్యాభివృద్ధి, వ్యాయామం, కుటుంబానికి కేటాయించాలని తెలిపారు. పౌష్టికాహారం తీసుకోవడం, తగినంత నిద్ర, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. మత్తు పదార్థాలకు యువత పూర్తిగా దూరంగా ఉండాలని, క్షణికావేశంలో తీసుకునే ఒక్క తప్పుడు నిర్ణయం జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు.
చిన్న వయసు నుంచే సంపాదన, పొదుపు, పెట్టుబడులపై అవగాహన పెంచుకోవాలని, అవసరం లేని అప్పులకు దూరంగా ఉంటూ ఆర్థిక క్రమశిక్షణను అలవర్చుకోవాలని చెప్పారు. ఓటు హక్కు వచ్చిన తర్వాత బాధ్యతతో, విచక్షణతో వ్యవహరిస్తూ ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. ఒక పరీక్షలో, ఉద్యోగంలో లేదా వ్యాపార ప్రయత్నంలో ఎదురయ్యే తాత్కాలిక వైఫల్యాలకు కుంగిపోకుండా పట్టుదలతో మళ్లీ ప్రయత్నించాలని విద్యార్థులకు ధైర్యం చెప్పారు. విద్యార్థులు అడిగిన వివిధ ప్రశ్నలకు ఎమ్మెల్యే సమాధానాలు ఇచ్చారు. ఆయన సమాధానాలు విద్యార్థులను ఆలోచింపజేశాయి. అనంతరం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన కళాశాల యాజమాన్యానికి ఎమ్మెల్యే ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,
మీ తరం భవిష్యత్తు కోసం ఎదురు చూసే తరం కాదు.. భవిష్యత్తును నిర్మించే తరం. చదువు, నైపుణ్యం, క్రమశిక్షణ, ఆరోగ్యం, సాంకేతిక పరిజ్ఞానం అనే ఐదు అంశాలను మీ జీవితంలో భాగం చేసుకోండి. సామాజిక మాధ్యమాల్లో కనిపించే ఆకర్షణలను చూసి మురిసిపోకుండా, నిజ జీవితంలో కష్టపడి సాధించే శాశ్వత విజయాలను లక్ష్యంగా పెట్టుకోండి. మీ కుటుంబానికి, మీ గ్రామానికి, మీ నియోజకవర్గానికి, దేశానికి ఉపయోగపడే అత్యున్నత స్థాయికి ఎదగాలి. ధైర్యంగా ముందుకు సాగండి.. విజయాలు మీ ముంగిటకు వస్తాయి. మీకు మీరే సాటి.. మీ తల్లిదండ్రులకు మీరే నిజమైన ఆస్తి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్, మాజీ మున్సిపల్ చైర్మన్ మీరావలి, కళాశాల కరస్పాండెంట్, కార్యదర్శి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# భారత్ కళా పురస్కార్--2026 అవార్డు విన్నర్ రవి కుమార్




**గుంటూరు:పెన్ పవర్, సెప్టెంబర్, 29,**
పట్వఅసోసియేషన్‌సెక్రటరీ,సీనియర్ ఫోటో గ్రాఫర్ రవి కుమార్ కు ప్రతిష్టాత్మకమైన భారత్ కళా పురస్కార్--2026 అవార్డు లభించింది.బెస్ట్ ట్రెడిషనల్ ఫోటోగ్రాఫర్ విభాగంలో రవి కుమార్ ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఫోటోగ్రఫీ రంగంలో ఆయన అందిస్తున్న సేవలు, సుదీర్ఘ అనుభవాన్ని గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందజేశారు.గుంటూరుకు చెందిన రవి కుమార్ ఫోటోగ్రఫీ రంగంలో తనదైన శైలితో గుర్తింపు పొందుతూ, సంప్రదాయ ఫోటోగ్రఫీని ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు.
ఈ సందర్భంగా రవి కుమార్‌కు పట్వ అసోసియేషన్ సభ్యులు, ఫోటోగ్రాఫర్లు, స్నేహితులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.

# ప్రజల మధ్యే పాలన. పనుల మధ్యే ప్రగతి రాచకొండ లక్ష్మయ్య



**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 29,**
ఒక వారం ఎన్నో మైలురాళ్లు. నెల్లూరు జిల్లా ఉదయగిరి నుంచి విశాఖ వరకు అభివృద్ధి విస్తరిస్తున్న తీరు ఆంధ్రప్రదేశ్‌లో మారుతున్న పాలనా దిశను చూపిస్తోంది.మన ముఖ్యమంత్రి మన ఉప ముఖ్యమంత్రి పల్లె పండుగ 3.0తో గ్రామీణ మౌలిక వసతులకు ?11,085 కోట్ల భారీ ఊతం---రోడ్లు, డ్రైన్లు, మినీ గోకులాలు, ఉద్యానవనాలతో పల్లెల రూపురేఖలు మార్చే లక్ష్యం.విజయవాడలో 25 వేల కుటుంబాలకు ఇళ్ల పట్టాలు, రేపల్లెలో ప్రజల గడప వద్దకే పింఛన్లు, మదనపల్లెలో రాయలసీమ హబ్, అభివృద్ధిసదస్సులతో పెట్టుబడులు--అవకాశాలకు కొత్త బాట. గ్రామీణ ప్రాంతాలకు 3 లక్షల ఇళ్ల కేటాయింపు కూడా మరో కీలక అడుగు. ప్రతి అడుగు అభివృద్ధి కొరకు రాష్ట్ర అభివృద్ధి ప్రతి ఆలోచన ప్రజల కొరకుచివరికి ప్రతి ఇంటికీ తాగునీరు చేరేలా జల్ జీవన్ మిషన్ – అంటే అభివృద్ధి కేవలం ఫైళ్లలో కాదు,ప్రతి ఇంటి గడపకు, ప్రతి గ్రామం దారికి, ప్రతి కుటుంబం జీవితానికి చేరేలా. అన్న ముఖ్యమంత్రి చంద్రబాబు మాటకు ఈ వరుస కార్యక్రమాలే ప్రత్యక్ష ఉదాహరణ.
ప్రజల దగ్గరికి ఈ ప్రభుత్వంప్రతి అడుగులో అభివృద్ధిప్రతి ఇంట్లో భరోసాఇదే మారుతున్న ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి ఆలోచన జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య అన్నారు

# ఉద్యోగులు జగన్ మాయలో పడొద్దు: టీడీపీ నేత తాళ్ల వెంకటేష్ యాదవ్

**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 29:**
ఉద్యోగులు రాజకీయ ప్రలోభాలకు లోనుకాకుండా ప్రజలకు సేవ చేయాలని టీడీపీ నేతలు సూచించారు. తమ ఉనికిని కాపాడుకునేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్ సచివాలయ ఉద్యోగులను రాజకీయంగా ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో సచివాలయ ఉద్యోగులకు సర్వీస్ రూల్స్, సరైన పదోన్నతి అవకాశాలు కల్పించలేదని, రెండేళ్ల ప్రొబేషన్ పూర్తయిన తర్వాత కూడా ఆలస్యంగా ప్రొబేషన్ ప్రకటించారని విమర్శించారు. పలువురు ఉద్యోగులు ఉద్యోగాలను వదిలివెళ్లే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.
ప్రభుత్వంలో భాగమైన సచివాలయ ఉద్యోగులు ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యతను గుర్తుంచుకోవాలని, ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంపై పరుష పదజాలంతో వ్యాఖ్యలు చేయడం సరికాదని తెలిపారు.
అదే సమయంలో, గత ప్రభుత్వ హయాంలో స్వర్ణ వార్డు, స్వర్ణ గ్రామ సచివాలయ ఉద్యోగాల నియామకాల్లో భారీగా అక్రమాలు జరిగాయని టీడీపీ నేతలు ఆరోపించారు. స్పోర్ట్స్ కోటా, ముగ్గుల పోటీలు, గ్రామీణ క్రీడలు తదితర అంశాలను ఉపయోగించి అర్హతలేని వారికి కూడా ఉద్యోగాలు ఇచ్చారని పేర్కొన్నారు. ఒక్కో ఉద్యోగానికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయని




తెలిపారు. సచివాలయ ఉద్యోగాల నియామకాలపై సీబీఐ విచారణకు సిద్ధమా అని జగన్‌ను ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా ఉద్యోగాల వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచామని, గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన స్పోర్ట్స్ కోటా ఉద్యోగాల వివరాలను ఎందుకు బహిర్గతం చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.
2019 అక్టోబర్ 2న నియమించిన స్వర్ణ వార్డు, స్వర్ణ గ్రామ సచివాలయ ఉద్యోగులను ఐదేళ్లపాటు ఎందుకు రెగ్యులరైజ్ చేయలేదని ప్రశ్నించారు. ఉద్యోగులు రాజకీయాలకు దూరంగా ఉండి ప్రజాసేవపై దృష్టి పెట్టాలని టీడీపీ నేతలు కోరారు.

# నాగరాజు కాలువలో రెండు మృతదేహాలు లభ్యం
## తెనాలికి చెందిన 23 ఏళ్ల యువకుడి మృతదేహం వెలికితీత -- మరో మృతదేహంపై కొనసాగుతున్న దర్యాప్తు





**బాపట్ల, సెప్టెంబర్ 29, (పెన్ పవర్) :**
హైదరపేట గ్రామ సమీపంలోని నాగరాజు కాలువలో రెండు మృతదేహాలు లభ్యమవడం కలకలం రేపింది. నాగరాజు కాలువ బ్రిడ్జి వద్ద నుంచి ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్న తెనాలికి చెందిన ఆకర్ష్ (23) అనే యువకుడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించి వెలికితీశారు. ఘటనపై బాపట్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.
ఇదే కాలువలో మరో గుర్తుతెలియని మృతదేహం కూడా లభ్యమైంది. దీంతో ఆ మృతదేహం ఎవరిదనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతదేహాలకు సంబంధించిన వివరాలను సేకరిస్తూ, ఘటనకు గల కారణాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బాపట్ల రూరల్ ఎస్సై అలేఖ్య ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# పందిళ్లపల్లి-1లో ఘనంగా అంగన్వాడీ ఉత్సవం
## చిన్నారుల ఆరోగ్యం, అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు పునాది

**వేటపాలెం, సెప్టెంబర్ 29 (పెన్ పవర్):**
వేటపాలెంమండలంలోని పందిళ్లపల్లి-1 అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం అంగన్వాడీ ఉత్సవాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు సజ్జ పుష్పవల్లి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజాసేవను పురస్కరించుకుని ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
ఆరు సంవత్సరాల లోపు చిన్నారులను తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని ఆమె తల్లిదండ్రులకు సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు ఆరోగ్య పరిరక్షణతో పాటు ఆటపాటలు, మానసిక వికాసం, ప్రాథమిక విద్యలో నైపుణ్యాలు పెంపొందుతాయని వివరించారు. ఇంటికి పునాది ఎంత ముఖ్యమో, మనిషి జీవితానికి అంగన్వాడీ కేంద్రం కూడా అంతే ముఖ్యమైన పునాది వంటిదని పేర్కొన్నారు.



అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న వివిధ సేవలు, వస్తువుల గురించి తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త పద్మ, ఆశా వర్కర్లు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## వేటపాలెం జడ్పీ గర్ల్స్ హైస్కూల్ నూతన ఎస్ఎంసి చైర్మన్, వైస్ చైర్మన్ లుగా ఎన్నికైన సురేఖ, నాగార్జున

## వేటపాలెం జడ్పీ హైస్కూల్లో ఎస్ఎంసి ఎన్నికలు : నూతన కమిటీ ఎన్నిక

**వేటపాలెం, సెప్టెంబర్ 29, (పెన్ పవర్) :**

వేటపాలెం జిల్లా పరిషత్ బాలికోన్నతో పాఠశాలలో మంగళవారం పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయురాలు దేవరకొండ. సరోజిని తెలియజేశారు. ఎస్ఎంసి చైర్మన్, వైస్ చైర్మన్లుగా యార్లగడ్డ. సురేఖ, బొడ్డు నాగార్జున ఎన్నికయ్యారు. వీరితో పాటు 22 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతన కమిటీ పాఠశాలలో విద్యార్థుల నమోదును, రోజువారి హాజరు, గుణాత్మక విద్య, బాలికా విద్యను పెంపొందించడంలో, నిలుపుదల లేకుండా చేయడంలో, ప్రభుత్వం సూచించిన వివిధ కార్యక్రమాలను అమలు పరచడంలో, పూర్వ విద్యార్థుల సంఘం ఏర్పాటు చేసి, వారి మరియు దాతల సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో సహకరించిన ఉపాధ్యాయులకు,



తల్లిదండ్రులకు, విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు ధన్యవాదాలు తెలియజేశారు.

## విద్యా కమిటీల్లో టీడీపీ మద్దతుదారుల హవా

## 237 పాఠశాలలో గాను 231 మంది విజయం



-కొత్త చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులకు ఎమ్మెల్యే ఏలూరి అభినందనలు

**పర్చూరు, సెప్టెంబర్ 29, (పెన్ పవర్)**

పాఠశాల విద్యా కమిటీల ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులు అధిక సంఖ్యలో విజయం సాధించారు. పర్చూరు నియోజకవర్గ వ్యాప్తంగా 237 పాఠశాల గాను ఒక పాఠశాల లో ఎన్నిక వాయిదా పడగా 231 మంది తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు విజయం సాధించారు. పర్చూరు నియోజకవర్గ పరిధిలోని పర్చూరు, యద్దనపూడి, కారంచేడు, చిన్నగంజాం, ఇంకొల్లు, మార్టూరు మండలాల్లోని పాఠశాలల్లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులు గణనీయ సంఖ్యలో గెలుపొందారు.

పర్చూరు మండలంలో 45 పాఠశాలలకు గాను 44 చోట్ల టీడీపీ మద్దతుదారులు విజయం సాధించారు. చెరుకూరు పాఠశాలలో ఎన్నిక వాయిదా పడింది. యద్దనపూడి మండలంలో 33కు 32, కారంచేడు మండలంలో 31కు 28, చిన్నగంజాం మండలంలో 37కు 37, ఇంకొల్లు మండలంలో 37కు 36, మార్టూరు మండలంలో 54కు 54 మంది టీడీపీ మద్దతుదారులు విజయం సాధించారు.

నూతనంగా ఎన్నికైన చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కమిటీ సభ్యులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అభినందించారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలతోపాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

## తిమ్మాపురంలో ఉద్రిక్తంగా మారిన ఎస్ఎంసీ ఎన్నికలు

## ప్రధానోపాధ్యాయుడి కిడ్నాప్, ఎన్నికల వాయిదా

**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, సెప్టెంబర్ 29 :**

చిలకలూరిపేట నియోజకవర్గం ఎడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌లో జరగాల్సిన పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. ఈ ఎన్నికలను కొందరు సభ్యులు ప్రతిష్ఠాత్మకంగా, ఆధిపత్య పోరుగా తీసుకోవడంతో గ్రామంలో వివాదం చెలరేగింది. ఉదయం విధులకు హాజరయ్యేందుకు వస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారని మండల ఎంఈఓ నాగరత్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు పాఠశాలలో ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుండగా, కొందరు అగంతకులు లోపలికి చొరబడి అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఇరువర్గాల మధ్య తోపులాట, భౌతిక దాడి చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో పలువురికి గాయాలు కాగా, అక్కడి వాతావరణం ఉద్రిక్తంగా మారడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భయాందోళనలతో ఇళ్లకు




వెనుదిరిగారు. ఈ అవాంఛనీయ ఘటనలు, ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తిమ్మాపురం ఎస్ఎంసీ ఎన్నికలను వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు.

## నియోజకవర్గంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఉత్సాహంగా జరుగుతున్న ఎస్ఎంసి ఎన్నికలు.




**పెన్ పవర్,కృష్ణాజిల్లాపెనములూరు, సెప్టెంబర్ 29**

పాఠశాల విద్యా కమిటీ అధ్యక్షులుగా ఎంతో ప్రాముఖ్యత ఉండటంతో ఎక్కువమంది ఆశవహులుగా పోటీలో నిలబడ్డారు.




నియోజకవర్గంలోని ఉయ్యూరు, కంకిపాడు, పెనమలూరు మండలాలు ఉయ్యూరు మున్సిపాలిటీ తాడిగడప మున్సిపాలిటీలు పరిధిలో జరుగుతున్న ఎన్నికలు. అధిక సంఖ్యలో పాల్గొన్న పేరెంట్స్ ప్రశాంతంగా కొనసాగుతున్న ఎన్నిక

## దొంగతనానికి వచ్చి దొరికిపోయిన దొంగలు..



**పెన్ పవర్,కృష్ణాజిల్లా పెనమలూరు, సెప్టెంబర్ 29**

పెనమలూరు మండలం పెద్దపులిపాక గ్రామంలో చోరీ చేసేందుకు ప్రయత్నించిన ఇద్దరు యువకులను స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అదే గ్రామానికి చెందిన ఒక యువకుడు ఇతనికి పరిచయమైన స్నేహితుడితో కలిసి పలు చోరీలు కు పాల్పడ్డాడు

తస్లీమ్ ఖాన్, షేక్ ఇబ్రహీం అని వీరిద్దరూ గతంలో కూడా గ్రామంలో చోరీలు చేసినట్లు తెలుస్తోంది.

వీరిపై ఇప్పటికే పలు కేసులు కూడా నమోదయ్యాయి

సోమవారం అర్ధరాత్రి రెండున్నర గంటల సమయంలో పెద్దపులిపాక గ్రామంలోని పలు దుకాణాలు వద్ద షట్టర్లు పగలగొట్టేందుకు ప్రయత్నం



చేశారు. అయితే ఒక దుకాణంలో షట్టర్ తీసి లోపలికి వెళ్ళగా దుకాణం ఎదురుగా నివసించే కుటుంబ సభ్యుడు వీరిని చూసి యువకుల లోపలికి వెళ్ళగా బయట షట్టర్ దింపి తాళం వేశాడు.

అప్రమత్తమైన అతను స్థానికులకు సమాచారం ఇచ్చి వారి ద్వారా నిందితులిద్దరిని పోలీసులకు అప్పగించారు.

కేసు నమోదు చేసిన పెనమలూరు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## పేదల కల సాకారం.. 30న 'పేదల పట్టాభిషేకం కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

**విజయవాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 29:**

పేద కుటుంబాల దశాబ్దాల కలను సాకారం చేస్తూ ఈనెల 30న విజయవాడలో 'పేదల పట్టాభిషేకం' కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది. అజిత్‌సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

జిల్లాలో తొలిదశలో 24 వేల మందికి పైగా లబ్ధిదారులను గుర్తించినట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని ఏళ్లుగా నివసిస్తున్న అర్హులకు పూర్తి హక్కులుకల్పించేలాహక్కుపత్రాలనుఅందించనున్నట్లు చెప్పారు.మొత్తం 616.56 ఎకరాలకు పైగా



భూమికి సంబంధించిన హక్కులు లబ్ధిదారులకు కల్పించనున్నారు. ఈ ఆస్తుల ఎస్ఆర్ విలువ సుమారు రూ.9,800 కోట్లు కాగా, మార్కెట్ విలువ రూ.23 వేల కోట్లకు పైగా ఉంటుందని అధికారులుతెలిపారు.కార్యక్రమంకోసం స్టేడియంలో సుమారు 100 ప్రత్యేక కౌంటర్లు



ఏర్పాటు చేశారు. లబ్ధిదారులకు రవాణా, వైద్య శిబిరాలు, నిరంతర విద్యుత్, సీటింగ్, పబ్లిక్ అడ్రెసింగ్‌తదితరఏర్పాట్లుచేశారు.కార్యక్రమంవిజయవంతానికిఅధికారులుసమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు.

## స్టాటిస్టికల్ బిజినెస్ రిజిస్టర్ బలోపేతానికి కీలక ఒప్పందం

## ఎంఎస్ఎంఈ, కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖల మధ్య అవగాహన ఒప్పందం



'ఉద్యమ్ రిజిస్ట్రేషన్' సమాచార మార్పిడికి వ్యవస్థీకృత విధానం

**న్యూఢిల్లీ, పెన్ పవర్,సెప్టెంబర్ 29:**

జాతీయ గణాంక వ్యాపార రిజిస్టర్‌ను అభివృద్ధి చేసి మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ (ఎంఎస్ఎంఈ), కేంద్ర గణాంకాలు--కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ (ఎంఓఎస్‌పీఐ) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది.

స్టాటిస్టికల్ బిజినెస్ రిజిస్టర్ (ఎస్‌బీఆర్) రూపకల్పనకు అవసరమైన సమాచారాన్ని పరస్పరం పంచుకునే విధానాన్ని సంస్థాగతం చేయడం ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.

ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, అభివృద్ధి కమిషనర్ డాక్టర్ రజనీశ్, ఎంఓఎస్‌పీఐ అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ దలీప్‌సింగ్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఇరు మంత్రిత్వ శాఖలకు చెందిన



ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

**'ఉద్యమ్' సమాచార మార్పిడికి ఏపీఐలు**

ఎంఎస్ఎంఈ శాఖ వద్ద అందుబాటులో ఉన్న 'ఉద్యమ్ రిజిస్ట్రేషన్'కు సంబంధించిన యూనిట్లవారీ సమాచారాన్ని అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్‌ల (ఏపీఐలు) ద్వారా గణాంకాల మంత్రిత్వ శాఖతో పంచుకునేందుకు ఈ ఒప్పందంలో విధివిధానాలను నిర్దేశించారు.

ద్విముఖ ఏపీఐ వ్యవస్థ ద్వారా సమాచార మార్పిడి జరుగుతుందని, ఈ డేటాను జాతీయ గణాంక వ్యాపార రిజిస్టర్ (ఎన్ఎస్‌బీఆర్) తయారీకి ఉపయోగిస్తారని వెల్లడించారు.

ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ 'ఉద్యమ్ రిజిస్ట్రేషన్' వ్యవస్థలోని సంబంధిత సమాచారాన్ని ఎంఓఎస్‌పీఐతో పంచుకోవడానికి ఈ ఒప్పందం క్రమబద్ధమైన వ్యవస్థను అందిస్తుంది. గణాంక అవసరాల కోసం వినియోగించే వ్యాపార సమాచార పరిధి, స్థిరత్వం, విశ్వసనీయతను మెరుగుపరచడానికి ఇది దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు.

## సికింద్రాబాద్, మహంకాళి జిల్లా ఓ బి సి మోర్చా ఆధ్వర్యంలో 'సేవా పాక్వాడ' -- వృద్ధాశ్రమంలో అన్నదానం



**న్యూఢిల్లీ, పెన్ పవర్,సెప్టెంబర్ 29:**

సికింద్రాబాద్, మహంకాళి జిల్లా ఓ బి సి మోర్చా నూతన కార్యవర్గ సభ్యుల నియామకం జరిగిన 24 గంటల్లోనే సమాజ సేవే ధ్యేయంగా అద్భుతమైన సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. మన ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని (సెప్టెంబర్ 17) పురస్కరించుకుని నెల రోజుల పాటు నిర్వహిస్తున్న 'సేవా పక్వాడ లో భాగంగా మంగళవారం మధ్యాహ్నం గాంధీ హాస్పిటల్ సమీపంలోని వృద్ధాశ్రమంలో 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఆత్మీయంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమాన్ని జిల్లా ఓ బి సి మోర్చా అధ్యక్షులు శ్రీ వై. సురేష్ అధ్యక్షతన, జిల్లా ఓ బి సి ఇన్‌చార్జ్ మేకల సారంగపాణి మార్గదర్శకత్వంలో



నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శీలం శివలింగం, రాజేష్ విశ్వం పాటు ప్రధాన కార్యదర్శులు, నూతన కమిటీ సభ్యులు మరియు పద్మారావు నగర్ నాయకులు విశేష సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

"సేవే పరమ ధర్మం" అనే లక్ష్యంతో సమాజ శ్రేయస్సు కోసం ఓ బి సి మోర్చా ఐక్యంగా పనిచేస్తుందని నాయకులు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులకు, ఆఫీస్ బేరర్లకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

మూట గణేష్‌ముడిగుల సురేష్ కుమార్‌దన్నారం బిక్షపతిలు పాల్గొన్నారు.

## కవిత ప్రశ్నలను కేటీఆర్, హరీశ్ రావు సమాధానం చెప్పాలి

## తెలంగాణ ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, పెన్ పవర్,సెప్టెంబర్ 29:**

మాజీ మంత్రులు, బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులపై తెలంగాణ ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సొంత కుటుంబ సభ్యురాలు కల్వకుంట్ల కవిత సంధించిన సూటి ప్రశ్నలకే కనీసం బదులివ్వలేని నిస్సహాయ స్థితిలో ఆ ఇద్దరు నేతలు ఉన్నారని ఎద్దేవా చేశారు. అసలు కవిత చెప్పినట్లుగా హరీశ్ రావు ఒక 'గుంటనక్క' అని విమర్శించారు. కేసీఆర్ కుమారుడిగా జన్మించడమే ఏకైక అర్హతగా ఎదిగిన కేటీఆర్కు అసలైన నాయకత్వ లక్షణాలు ఏమాత్రం లేవని, కేసీఆర్ కొడుకు కాకపోతే ఆయనకు రాజకీయ మనుగడే ఉండేది కాదని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యేలకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించడం తప్పంటూ కేటీఆర్ మాట్లాడటం ఆయన నియంతృత్వ పోకడలకు నిదర్శనమని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ పాలనలో తమ ఎమ్మెల్యేలు అడ్డగోలుగా నిధులు దోచుకునే స్వేచ్ఛను కేసీఆర్ కల్పించారని, అదే సమయంలో సొంత పార్టీ గిరిజన ఎమ్మెల్యేలు వేడుకున్నా నిధులు మంజూరు చేయకుండా తీవ్ర వివక్ష చూపారని ఆరోపించారు. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ వ్యక్తులతో కలిసి కేసీఆర్ కుటుంబం నడిపిన ఫామహౌస్లు, అక్రమ వ్యాపారాల గుట్టు రాష్ట్ర ప్రజలందరికీ పూర్తిగా తెలుసని అద్దంకి దయాకర్ ఆరోపించారు. పదేండ్ల అధికారంలో తెలంగాణ ఉద్యమంతో ఎలాంటి సంబంధం లేని వ్యాపారవేత్తలకు కోట్ల రూపాయలు దోచిపెట్టి, ఉద్యమానికి ప్రాణాలర్పించిన కోదండరాం, మందకృష్ణ మాదిగ వంటి నిజమైన పోరాట యోధులపై కేసులు పెట్టి జైళ్లకు పంపారని ఆగ్రహం



వ్యక్తం చేశారు. ఉద్యమ ద్రోహులను అందలం ఎక్కించి తెలంగాణను సర్వనాశనం చేసినందుకే వారికి ప్రజల పాపం తగిలి అధికారం కోల్పోయారని, ఎట్టి పరిస్థితుల్లోనూ బీఆర్ఎస్ న్ను మళ్లీ రానివ్వకూడదని రాష్ట్ర సమాజం ఇప్పటికే స్పష్టమైన నిర్ణయానికి వచ్చిందని తేల్చిచెప్పారు. పైసలు ఇచ్చి కృత్రిమంగా పాటలు, ప్రచారాలు చేయించుకోవడం మానుకుని, ముందు తమ సొంత కుటుంబంలోని ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కేటీఆర్, హరీశ్ రావులకు హితవు పలికారు.

# టీ20ల్లో శ్రీ చరణి సరికొత్త రికార్డు.. మళ్లీ టాప్-5లోకి స్మృతి మంధాన!



హైదరాబాద్ పెన్ పవర్: అంతర్జాతీయ క్రికెట్ మండలి తాజాగా విడుదల చేసిన మహిళల టీ20ఐ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ శ్రీ చరణి సంచలన రికార్డు సృష్టించింది. అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ కెరీర్‌లోనే అత్యధికంగా 817 రేటింగ్ పాయింట్లను సాధించి సరికొత్త చరిత్ర సృష్టించింది. దీంతో నవంబర్ 2018 నుంచి ఆస్ట్రేలియా స్టార్ బౌలర్ మెగాన్ షట్ పేరు మీద ఉన్న 806 పాయింట్ల ఆల్-టైమ్ రికార్డును శ్రీ చరణి బ్రేక్ చేసేసింది. ఆసియా కప్ టోర్నమెంట్‌లో భారత్ విజయం సాధించడంలో శ్రీ చరణి కీలక పాత్ర పోషించింది. ఈ టోర్నీలో మొత్తం 12 వికెట్లు తీసిన ఆమె, శ్రీలంకతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 4/20తో అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఇక ఆసియా క్రీడలలోనూ తన జోరును కొనసాగించిన చరణి.. జపాన్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో కేవలం 10 పరుగులే ఇచ్చి 4 వికెట్లు (4/10) పడగొట్టి కెరీర్ బెస్ట్ ఫిగర్స్ నమోదు చేసింది. అంతేకాకుండా శ్రీలంకతో జరిగిన స్వర్ణ పతక పోరులోనూ కీలకమైన 2 వికెట్లు తీసి టీమిండియాకు గోల్డ్ మెడల్ అందించడంలో ప్రధాన భూమిక పోషించింది. ఈ అద్భుతమైన ప్రదర్శనే ఆమెను ఐసీసీ చరిత్రలోనే అత్యధిక రేటింగ్ సాధించిన బౌలర్‌గా నిలబెట్టింది.

**టాప్-5లోకి దూసుకొచ్చిన స్మృతి, దీప్తి శర్మ:**

ఆసియా క్రీడల ఫైనల్ మ్యాచ్‌లో అద్భుతమైన బ్యాటింగ్‌తో 79 పరుగులు సాధించిన భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో మళ్లీ టాప్-5లోకి దూసుకొచ్చారు. అంతేకాకుండా ఆమె వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్-1 స్థానాన్ని పదిలపరుచుకున్నారు.

ఆసియా క్రీడల ఫైనల్‌లో మూడు వికెట్లు తీసిన ఆల్ రౌండర్ దీప్తి శర్మ 754 పాయింట్లతో తన స్థానాన్ని మరింత మెరుగుపరుచుకోగా, ఇంగ్లాండ్ ఆటగాడు సోఫీ ఎక్లెస్టన్ (723) మూడో స్థానంలో కొనసాగుతుంది.

# వర్షం దెబ్బకు నాలుగు క్వార్టర్ ఫైనల్స్ రద్దు.. సెమీస్ బెర్త్ ఫిక్స్: పాక్‌తో కాదు శ్రీలంకతోనే భారత్ ఢీ

హైదరాబాద్ పెన్ పవర్: 2026 ఆసియా క్రీడలలో పురుషుల క్రికెట్ టోర్నమెంట్‌ను వర్షం తీవ్రంగా దెబ్బతీసింది. నిరంతరం కురుస్తున్న వర్షాల కారణంగా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లన్నీ రద్దు కావడంతో, టోర్నమెంట్ రూల్స్ ప్రకారం సెమీఫైనల్స్ బెర్త్‌లు ఖరారయ్యాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న టీమిండియా.. ఫైనల్ పోరుకు అర్హత సాధించేందుకు శ్రీలంకతో తలపడనుంది.




**వర్షం దెబ్బకు అన్నీ క్వార్టర్ ఫైనల్స్ రద్దు:**

నాగోయా, నిస్షిన్ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మెన్స్ క్రికెట్ నాకౌట్ దశ మ్యాచ్‌లకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పాకిస్థాన్ - హాంకాంగ్, భారత్ ఆఫ్ఘనిస్తాన్ జట్ల మధ్య జరగాల్సిన తొలి రెండు క్వార్టర్ ఫైనల్స్ వర్షంతో పూర్తిగా రద్దయ్యాయి. ఐసీసీ టీ20ఐ ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానంలో ఉన్న కారణంగా భారత్, పాకిస్థాన్‌లు నేరుగా సెమీస్‌లోకి ప్రవేశించాయి. అలాగే శ్రీలంక వర్సెస్ నేపాల్, బంగ్లాదేశ్ వర్సెస్ మలేషియా మ్యాచ్‌లు కూడా వర్షార్పణం కావడంతో, ర్యాంకింగ్ ఆధారంగా శ్రీలంక, బంగ్లాదేశ్ కూడా సెమీఫైనల్‌కు చేరుకున్నాయి.

**శ్రేయస్ కెప్టెన్సీలో బరిలోకి భారత్:**

స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత జట్టు ఇంకా ఈ ఆసియా క్రీడల్లో ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోయినా నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. ఈ జట్టులో స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాతో పాటు 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ కూడా చోటు దక్కించుకోవడం విశేషం. ప్రధాన కోచ్ గౌతం గంభీర్ గైర్హాజరీలో నేషనల్ క్రికెట్ అకాడమీ చీఫ్ వీవీఎస్ లక్ష్మణ్ ఈ టోర్నీకి హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు.

**అక్టోబర్ 1న సెమీఫైనల్స్:**

వర్షం అంతరాయం తొలగిపోయి, వాతావరణం అనుకూలిస్తే అక్టోబర్ 1వ తేదీ (గురువారం)న రెండు హై-వోల్టేజ్ సెమీఫైనల్స్ జరగనున్నాయి.

మొదటి సెమీఫైనల్: పాకిస్థాన్ జం బంగ్లాదేశ్

రెండో సెమీఫైనల్: భారత్ జం శ్రీలంక (వేదిక: కొరోగి స్పోర్ట్స్ పార్క్, నిస్షిన్)

# ట్రాక్‌పై దుమ్మురేపిన భారత అమ్మాయిలు.. 4X400 మీటర్ల రిలేలో స్వర్ణం





హైదరాబాద్ పెన్ పవర్: వేదికగా జరుగుతున్న 2026 ఆసియా క్రీడలలో (ూంఖుఅ +ఖుఎవం 2026) అథ్లెటిక్స్ విభాగంలో భారత్ ఎట్టకేలకు తన తొలి బంగారు పతకాన్ని సాధించింది. గత కొన్ని రోజులుగా రజత, కాంస్య పతకాలతో సరిపెట్టుకున్న టీమిండియా అథ్లెట్లు, ఈరోజు (సెప్టెంబర్ 29, మంగళవారం) జరిగిన మహిళల 4ఞ400 మీటర్ల రిలే ఫైనల్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి దేశానికి చిరస్మరణీయ పసిడిని అందించారు.

**అదరగొట్టిన మహిళల జట్టు.. అథ్లెటిక్స్ లో స్వర్ణం:**

భారత మహిళల రిలే జట్టులో కీలక సభ్యులైన విత్య రామ్‌రాజ్, కిరణ్ పహల్, మచేత్తిర పూవమ్మ, ప్రాచి అద్భుతమైన సమన్వయంతో బరిలోకి దిగారు. హోరాహోరీగా సాగిన ఈ తుది పోరులో భారత క్వార్టెట్ కేవలం 3:29.69 సెకన్ల వ్యవధిలో గమ్యస్థానాన్ని చేరి మొదటి స్థానంలో నిలిచింది. చివరి ల్యాప్‌లో బహ్రెయిన్ (3:30.21), చైనా (3:31.02) జట్ల నుంచి తీవ్రమైన పోటీ ఎదురైనప్పటికీ, భారత రన్నర్లు ఏమాత్రం తడబడకుండా అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. బహ్రెయిన్ రజతం, చైనా కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నాయి.

**చరిత్ర సృష్టించిన విత్య.. ఒకే గేమ్స్‌లో 3 పతకాలు:**

ఈ స్వర్ణ పతకం గెలుపుతో అథ్లెట్ విత్య రామ్‌రాజ్ తన అద్భుతమైన ఆసియా క్రీడల ప్రయాణాన్ని ముగించింది. ఈ క్రీడలలో ఆమెకు ఇది మూడో పతకం కావడం విశేషం. ఇప్పటికే మిక్స్‌డ్ 4ఞ400 మీటర్ల రిలేలో రజతం సాధించిన విత్య.. మహిళల 400 మీటర్ల హర్డిల్స్ విభాగంలో దిగ్గజ అథ్లెట్ పీటీ ఉష యొక్క 42 ఏళ్ల నాటి జాతీయ రికార్డును (54.75 సెకన్లు) బద్దలు కొట్టి మరీ కాంస్య పతకం గెలుచుకుంది. తాజాగా ఈ రిలే గోల్డ్‌తో ఆమె తన ఖాతాలో అరుదైన ట్రిపుల్ మెడల్స్ సాధించారు.

# దసరా బరిలో జైలర్ 2 & రణబాలి ప్రమోషనల్ స్ట్రాటజీ!







దసరా పండుగ అత్యంత ఆసక్తికరంగా మారబోతోంది. పండుగ వాతావరణంలో సూపర్‌స్టార్ రజినీకాంత్ నటిస్తున్న -జైలర్ 2-, విజయ్ దేవరకొండ - రష్మిక మందన్న జంటగా తెరకెక్కుతోన్న -రణబాలి- చిత్రాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. రెండు చిత్రాలు దసరా కానుకగా ఒక్క రోజు గ్యాప్ లోనే విడుదలవుతుండటంతో సన్నివేశం ఆసక్తికరంగా మారుతోంది.

నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న -జైలర్ 2- ( అక్టోబర్15) పై ఇప్పటికే భారీ హైప్ నెలకొంది. మొదటి భాగంలో టైగర్ ముత్తువేల్ పాండ్యన్‌గా రజినీకాంత్ చూపించిన పవర్ ఫుల్ యాక్షన్ అండ్ మేనరిజమ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతో సీక్వెల్‌లో రజినీకాంత్ పాత్ర ఎలా ఉండబోతోంది? యాక్షన్ ఎపిసోడ్స్ ఏ స్థాయిలో తెరకెక్కించారనే విషయంపై అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది.మరోవైపు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న నటిస్తోన్న -రణబాలి-( అక్టోబర్ 16) చిత్రం కూడా అదే రేంజ్‌లో అంచనాలను పెంచేస్తోంది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్-ఇండియా పీరియాడికల్ యాక్షన్ డ్రామా స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన కొన్ని చీకటి అధ్యాయాలు, యదార్థ సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకుంటోంది.అయితే ఈ రెండు చిత్రాల ప్రమోషన్స్ కోసం ఎంచుకున్న వినూత్న వ్యూహం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. రెండు చిత్రబృందాలు టీజర్లు, ట్రైలర్లతో పాటు మేకింగ్ డాక్యుమెంటరీల ద్వారా ప్రమోషన్లు నిర్వహించే ఒకే రకమైన స్ట్రాటజీని ఫాలో అవుతున్నాయి. ఇప్పటికే -జైలర్ 2- టీమ్ -జైలర్ 2 అన్‌లాక్డ్- పేరుతో విడుదల చేసిన స్పెషల్ డాక్యుమెంటరీ యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో నిలవగా.. -రణబాలి- బృందం కూడా ఏకంగా నాలుగు ఎపిసోడ్ల భారీ మేకింగ్ డాక్యుమెంటరీ సిరీస్‌ను విడుదల చేసేందుకు సిద్ధమవుతోంది.సినిమా వెనుక ఉన్న కష్టం, టెక్నికల్ విలువలు, లొకేషన్లు , నటీనటుల శ్రమను డాక్యుమెంటరీ రూపంలో నేరుగా ప్రేక్షకులకు చూపించడం వల్ల సినిమాపై మరింత కనెక్టివిటీ, విశ్వసనీయత పెరుగుతాయని నిర్మాతలు భావిస్తు న్నారు.

సాధారణ ప్రచార చిత్రాల కంటే ఇలాంటి బిహైండ్-ది-సీన్స్ డాక్యుమెంటరీలు జాతీయ స్థాయిలో సినీ ప్రేమికులను ఆకట్టుకుంటూ సినిమా మేకింగ్ ప్రమాణాలను ఉన్నత స్థాయిలో నిలబెడుతున్నాయి.రెండు సినిమాల బాట ఒకటే కావడంతో సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పవర్ ఫుల్ మాస్ యాక్షన్ అంశాలతో -జైలర్ 2- వస్తుంటే? వైవిధ్యమైన చారిత్రక కథాంశంతో -రణబాలి- రేసులో ఉంది. మరి దసరా బరిలో ఎవరు విజేత అవుతారు? అన్నది చూడాలి.

అయితే ఈ రెండు సినిమాల ప్రభావం చాలా సినిమాలపై పడుతుంది. పండగ నేపథ్యంలో చాలా సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. దీంతో థియేటర్ల పరంగా ఇబ్బంది ఎదురవుతుంది.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com